





తీరంలో అలజడి!

● అల్పపీడన ప్రభావంతో ఈదురు గాలులు ● కల్లోలంగా మారిన సముద్రం

కొత్తపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఇటీవల ఒకదాని తర్వాత ఒకటిగా దూసుకొస్తున్న అల్పపీడనాలతో తీర ప్రాంత గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉప్పాడ తీరంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. సముద్రం లోపల నుంచి అతి వేగంగా వస్తున్న ఈదురు గాలులకు సముద్రం కల్లోలంగా మారింది. దీంతో తెల్లవారుజామునే వేటకు వెళ్లిన మత్స్యకారులు ఉదయం 11 గంటలకే ఒడ్డుకు చేరుకొన్నారు. ఇటీవల తరచూ వారానికో, పదిహేను రోజులకో, లేక నెలలోపో ఏర్పడుతున్న అల్పపీడనాలతో తీరప్రాంత గ్రామాలైన కోనపాపపేట, మూలపేట, అమీనబాద్, మాయాపట్నం, సూరాడపేట, రామిశెట్టిపేట, కొత్తపట్నం, సుబ్బంపేట గ్రామాల్లో మత్స్యకారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం గడుపుతున్నారు. అల్పపీడనాలు ఏర్పడిన ప్రతీసారీ కెరటాలు ఎగసిపడుతూ మత్స్యకారుల గృహాల్లోకి దూసుకుపోవడం, తక్షణం అక్కడ నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లడం పరిపాటిగా మారింది. తరచు తుఫాన్లు రావడం, ఎక్కడో అక్కడ తలదాచుకోవడం తప్పితే జీవనోపాధిపై దృష్టి సారించేందుకు సమయం లేకపోవడంతో మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల తరచూ సంభవించిన తుఫాన్లు, అల్పపీడనాల్లో ఏ నాయకులూ తమను పరామర్శించి సాయం అందించిన దాఖలాలు లేకపోవడంతో మత్స్యకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వేట నిషేధంలో మంజూరు కావాల్సిన పరిహారం కూడా నేటికీ చెల్లించకపోవడంతో మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంతా సత్యం!



గత నెల 29న స్టెల్లా షిప్‌లో బియ్యం తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ (ఫైల్)

స్టెల్లా షిప్‌లో పట్టుబడ్డ రేషన్ బియ్యం

» అంతా సత్యం బాలాజీ కంపెనీదే
» 1320 మెట్రిక్ టన్నులు పట్టివేత
» చత్తీస్‌గఢ్ కంపెనీ పేరు
» జూలైలో పట్టుబడ్డ బియ్యం
» పాలిష్‌చేసి మళ్లీ ఎగుమతి
» గుట్టు తేల్చేపనిలో అధికారులు
» నిలిచిపోయిన బియ్యం లోడింగ్
» హైకోర్టులో వ్యాపారుల పిటిషన్
» నేటి నుంచి ముమ్మర దర్యాప్తు
» నౌకలో బియ్యం దించాలని ఆదేశం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

స్టెల్లా నౌకలో రేషన్ గుట్టు వీడింది.. విదేశాలకు తరలిపోవడానికి సిద్ధమైన పేదల బియ్యం లెక్కతేలింది. అధికారుల కళ్లుగప్పి.. చెక్ పోస్టులను మాయచేసి సముద్రాలను దాటించేయడానికి చూసిన బియ్యం స్మగ్లింగ్ దందా బయటపడింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 1,320 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి దేశాలు దాటించేయడానికి చూసిన అక్రమార్కుల పాపం పండింది. ఈ నేపథ్యంలో గుర్తించిన బియ్యాన్ని నౌక నుంచి కిందకు దించేయడానికి అధికారులు నిర్ణయించారు.అసలు ఈ బియ్యం సదరు సత్యం బాలాజీ కంపెనీకి ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై నేటి నుంచి దర్యాప్తు చేయబోతున్నారు. ఏ మిల్లుల నుంచి ఈ సరుకు వచ్చింది? చత్తీస్‌గఢ్‌కు చెందిన సదరు సత్యం బాలాజీ కంపెనీకి ఇక్కడ సహకరిస్తున్నదెవరు అనే గుట్టులాగనున్నారు. నౌక నుంచి రేషన్‌బియ్యం దించేయాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ ప్రస్తుతం సముద్రంలో అల్లకల్లోల వాతావరణంతో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. మరోపక్క ఈ అన్‌లోడింగ్ పూరయ్యాకే మిగిలిన బియ్యాన్ని లోడ్‌చేసి పది రోజుల్లో స్టెల్లా కదలడానికి అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్నారు. ఇదిలా ఉంటే నౌకలోకి తమ పారాబాయిల్డ్ బియ్యం ఎగుమతికి అధికారులు అనుమతించడం లేదని కొందరు వ్యాపారులు కోర్టును ఆశ్రయించడం విశేషం.

స్టెల్లా కదిలేది అప్పుడేనా...

పనామా ఫ్లాగ్‌తో ఉన్న స్టెల్లా నౌక కాకినాడకు బియ్యం లోడింగ్‌కు వచ్చి 35రోజులుపైనే దాటుతోంది. ఇందులో రేషన్ బియ్యం లోడైన నేపథ్యంలో అదనపు తనిఖీలు, శాంపిళ్ల కోసం ఈ నౌకలోకి బియ్యం లోడింగ్‌ను అధికారులు నిలిపివేశారు. దీంతో అప్పటి నుంచీ ఈ నౌక కాకినాడలోనే ఉండిపోయింది. అయితే ఇప్పుడు శాంపిళ్ల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో గుర్తించిన రేషన్ బియ్యాన్ని దించేయనున్నారు. ఈమేరకు పోర్టు అధికారులు కస్టమ్స్ విభాగంతో సంప్రదింపులు జరపగా బుధవారం నుంచి అన్‌లోడింగ్ ప్రక్రియ మొదలుపెట్టి రెండు రోజుల్లో సరుకంతా దించేయాలని భావించారు. తీరా అల్పపీడనం ప్రభావంతో మంగళవారం నుంచి సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రంలోపల గంటకు 48 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తుండడంతో బుధవారం నుంచి అన్‌లోడింగ్ ప్రక్రియ సాధ్యం కాదని తేల్చేశారు. వాతావరణం సద్దుమణిగిన తర్వాత బియ్యం అన్‌లోడింగ్ చేయడం, ఇంకా మిగిలిన 12 వేల మెట్రిక్ టన్నులు నౌకలోకి లోడింగ్ చేయాల్సి ఉండడంతో ఈ ప్రక్రియ పూర్తికావడానికి దాదాపు రెండు వారాలకుపైగా సమయం పట్టే అవకాశం ఉంది. ఆ తర్వాతే కాకినాడ నుంచి స్టెల్లా నౌక కదలనుంది. కాగా స్టెల్లా నౌకలో రేషన్ బియ్యం ఉన్నాయనే కారణంతో ఈ నౌకలోకి తమ పారాబాయిల్డ్ బియ్యం ఎగుమతి చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారంటూ మూడు బియ్యం ఎగుమతి కంపెనీలు హైకోర్టును ఆశ్రయించాయి. దీంతో హైకోర్టు విచారణలో భాగంగా నౌకలో బియ్యం లోడింగ్ జరగకుండా ప్రభుత్వానికి అడ్డుకునే అధికారాలు ఏమిటని న్యాయస్థానం మంగళవారం ప్రశ్నించింది. ఈ కేసును గురువారానికి వాయిదా వేసింది.

ఆ బియ్యం అవే..

కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి విదేశాలకు అక్రమంగా రేషన్ బియ్యం ఎగుమవుతున్నాయన్న వైనం మరోసారి పక్కా ఆధారాలతో బయటపడింది. ఈమేరకు స్టెల్లా షిప్‌లో అధికారులు డిసెంబరు 4న సేకరించిన 12 శాంపిళ్ల నిజాలను నిర్ధారించాయి. షిప్‌లో ఐదు హేచ్‌ల్లో లోడైన మొత్తం 32,416 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంలో మూడో నెంబర్ హేచ్‌లో ఎగుమతికి సిద్ధం చేసిన పది వేల మెట్రిక్ టన్నుల సరుకులో రేషన్ బియ్యం ఆనవాళ్లు తేలాయి. ఈ బియ్యం అంతా సత్యం బాలాజీ కంపెనీదిగా అధికారులు గుర్తించారు. వాస్తవానికి స్టెల్లా నౌకలో రేషన్ బియ్యం ఎగుమతి జరుగుతుందనే సమాచారంతో గత నెల 29న డిప్యూటీ సీఎం పవన్ అక్కడకు వెళ్లి షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించారు. ఆ సమయానికి నౌక హేచ్-1లో 640 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు నిర్ధారించారు. అయితే మిగిలిన హేచ్‌ల్లో లోడైన బియ్యాన్ని కూడా తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఈ ఏడాది జూలైలో పట్టుబడ్డ 42 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని న్యాయస్థానం ఆదేశాలతో బ్యాంకు గ్యారంటీలు తీసుకుని వ్యాపారులకు తిరిగి అప్పగించేశారు. అయితే నౌకలో పట్టుబడ్డ బియ్యం.. అప్పట్లో వెనక్కు ఇచ్చేసిన బియ్యం ఒకటేనా అనే దానిపైనా శాంపిళ్లను సరిపోల్చగా మొత్తం బండారం బట్టబయలైంది. అప్పుడు వెనక్కు ఇచ్చేసిన బియ్యం, షిప్‌లో లోడైన బియ్యం ఒకటేనని ఎట్టకేలకు తేలింది. స్టెల్లా నౌకలో లోడైన 15 కంపెనీలకు చెందిన 32,416 మెట్రిక్ టన్నుల బియ్యంలో సత్యం బాలాజీ అనే కంపెనీకి చెందిన 10 వేల మెట్రిక్ టన్నుల్లో మొత్తం 1,320 మెట్రిక్ టన్నులు రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. ఇందులో 640 మెట్రిక్ టన్నులు గతంలో గుర్తించిందే కాగా అదనంగా శాంపిళ్ల ద్వారా 680 మెట్రిక్ టన్నులు కొత్తగా రేషన్‌గా బయటపడింది. ఇదంతా నౌక నుంచి దించేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే చత్తీస్‌గఢ్‌కు చెందిన సత్యం బాలాజీ కంపెనీ కాకినాడ యాంకరేజ్‌పోర్టు ద్వారా రేషన్ బియ్యం ఎగుమతికి బరితెగించిందంటే అసలు ఇంత బియ్యం ఆ కంపెనీకి ఎలా వచ్చాయనేది విస్మయ పరుస్తోంది. ఈ బియ్యం అంతా కాకినాడ జిల్లాలో సేకరించినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు నేటి నుంచి దర్యాప్తు ముమ్మరం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ కంపెనీ తరఫున బియ్యాన్ని షిప్‌లోకి ఎగుమతి చేస్తోన్న లోటస్ మెరైన్ లాజిస్టిక్స్ అనే షిప్పింగ్ కంపెనీ ప్రతినిధులను విచారించనున్నారు. మరో పక్క జులైలో పట్టుబడ్డ తమ రేషన్ బియ్యాన్ని సత్యం బాలాజీ కంపెనీ తిరిగి మిల్లుల్లో పాలిష్ చేసి ప్యాకింగ్ చేసి ఎగుమతి చేస్తోన్న నేపథ్యంలో ఇందుకు సహకరించిన మిల్లులపైనా గురి పెట్టనున్నారు. ఒకరకంగా చెప్పాలంటే సత్యం బాలాజీ రేషన్ అక్రమాల డొంక కదిల్చి పెద్దఎత్తున పీడీ కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. మిల్లుల బాగోతమూ బట్టబయలుకానుంది.

సమస్యలకు పరిష్కారం లభించేనా?

నేడు తొలి డీఆర్‌సీ సమావేశం.. జిల్లాకు వస్తున్న ఇన్‌చార్జి మంత్రి నారాయణ
రబీలో సాగునీరు, ఇసుక సమస్య, ఏలేరు ఆధునికీకరణపై ప్రస్తావించే అవకాశం
నిధులు లేక నిలిచిపోయిన పనులపై సమీక్ష

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేరుకుపోయిన సమస్యలకు జిల్లా సమీక్ష కమిటీ (డీఆర్‌సీ) సమావేశంలో పరిష్కారం లభించగలదని జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు తొలి డీఆర్‌సీ సమావేశం జరుగుతుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరి నారాయణ విచ్చేస్తున్నారు. జిల్లాలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాస్థాయి అధికారులు హాజరుకానున్నారు. అయితే జిల్లాలో జరిగే తొలి డీఆర్‌సీ సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాలో అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. ప్రధానంగా రబీలో సాగునీరు విడుదలపై సమీక్షించనున్నారు. ప్రతి సంవత్సరం రబీలో సాగునీరు ఎద్దడి వస్తుంది. దీనివల్ల శివారుప్రాంతాల్లో పంట పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో ఈ రబీసాగు ప్రణాళికపై చర్చిస్తారు. అలాగే జిల్లాలో ఇసుక సమస్య ఉంది. ఇసుక స్టాక్ యార్డులను ప్రారంభించలేదు. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ప్రస్తావించే అవకాశం ఉంది. అలాగే సముద్రతీర ప్రాంతంలో దివిస్, అరబిందో ఫార్మా కంపెనీల వల్ల కాలుష్యం సముద్రంలోకి ప్రవేశిస్తోందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. కాలుష్యం వల్ల మత్స్య సంపదకు నష్టం కలుగుతోందని నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు మంత్రి ముందు ప్రస్తావించనున్నారు. అలాగే ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ, ఏలేరు ఆధునికీకరణ, పంచాయతీల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మాణాలపై సమీక్ష జరిగే అవకాశం ఉంది. అలాగే ఎజెండాలో పలు అంశాలను సమీక్షిస్తారు.

ప్రీమియం స్టోర్ ఏర్పాటు కోసం గెజిట్ నోటిఫికేషన్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నూతన ఎక్సైజ్ విధానంలో భాగంగా ప్రజలకు మెరుగైన, నాణ్యమైన రిటైల్ సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం స్టోర్లు ఏర్పాటుకు అనుమతిస్తూ గెజిట్ జారీ చేసినట్టు జిల్లా అబ్కారీ అధికారిణి ఎం.కృష్ణకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 12 ప్రీమియం స్టోర్స్ మంజూరుకాగా, కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఒక ప్రీమియం స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. అయిదేళ్ల స్టోర్ లైసెన్స్ కోసం లైసెన్స్ మంజూరు చేస్తారన్నారు. రిటైల్ ఎక్సైజ్ టాక్స్ మొదటి ఏడాది లైసెన్స్‌దారులు కోటి రూపాయలు చెల్లించాలని, రెండో ఏడాది నుంచి 10 శాతం పెరుగుదల ఉంటుందన్నారు. ప్రీమియం స్టోర్ కోసం హెచ్‌టీటీపీఎస్://ఏపీఎస్‌బీసీఎల్.ఏపీ.జీవోవీ.ఇన్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

మళ్లీ వణుకు

» అల్పపీడనద్రోణి ప్రభావంతో రైతుల్లో కలవరం
» చలి గాలులు.. పడిపోతున్న ఉష్ణోగ్రతలు
» మారిన వాతావరణం.. అక్కడక్కడా వర్షం
» ధాన్యం రాశులు తడవకుండా రైతుల పాట్లు
» సార్వా చివరి దశలోనూ వీడని అల్పపీడనం



పిఠాపురం బైపాస్‌రోడ్డులో ధాన్యం తడవ కుండా కప్పిన బరకాలు

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం/గొల్లప్రోలు)

సార్వా చివరి దశలోనూ రైతులను అల్పపీడనం, వాయుగుండాలు వెన్నాడుతూనే ఉన్నాయి. వారంరోజుల్లో వరి మాసూళ్లు పూర్తవుతాయి అనుకున్న దశలో బంగాళాఖాతంలో తాజాగా ఏర్పడుతున్న అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం మారిపోయింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. రైతుల్లో అంతా హడావుడి. ఆరిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తూ, మరోవైపు ఆరబెట్టిన ధాన్యం రాశులను తడవకుండా కాపాడుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. బంగాళాశాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బుధవారానికి అల్పపీడనంగా మారి వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు అప్రమత్తమయ్యారు. మంగళవారం ఉదయం ఎండకాయడంతో ఇక్కడ అల్పపీడన ప్రభావం ఉండదని భావించిన రైతాంగానికి మధ్యాహ్నం నుంచి మారిన వాతావరణం షాక్ ఇచ్చింది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమైంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో సాయంత్రం చిరుజల్లులు పడ్డాయి. దీంతో వాతావరణశాఖ హెచ్చరికల ప్రకారం బుధవారం నుంచి వర్షాలు కురుస్తాయని భావించిన రైతాంగం ముందుజాగ్రత్త చర్యలకు ఉపక్రమించింది. పండిన పంట కాపాడుకునే ప్రయత్నాలు చేపట్టారు. ఏలేరు, పీబీసీ ఆయకట్టుతో మెట్ట ప్రాంతాల్లో 90 శాతం విస్తీర్ణంలో ఇప్పటికే వరికోతలు, మాసూళ్లు పూర్తయ్యాయి. వరికోత యంత్రాల ద్వారా అధికంగా మాసూళ్ల (నూర్పిళ్లు) నిర్వహించిన నేపథ్యంలో పలు ప్రాంతాల్లో రహదారులు వెంబడి, కళ్లాలు, పంటపొలాల్లో ధాన్యాన్ని కొద్దిరోజులుగా ఆరబెడుతున్నారు. పిఠాపురం-సామర్లకోట ఆర్‌అండ్‌బీ రహదారి, పిఠాపురం, గొల్లప్రోలు, చేబ్రోలు బైపాస్‌రోడ్లుతోపాటు అన్ని గ్రామీణ ప్రాంతాల రహదారులపై ఎక్కడ చూసిన ధాన్యం రాశులే ఉన్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన తేమశాతానికి అనుగుణంగా ధాన్యం ఆరబెట్టకుంటే మిల్లర్లు తీసుకునేందుకు నిరాకరిస్తున్న నేపథ్యంలో రైతులు శ్రమైనా ఆరబెట్టేందుకే మొగ్గు చూపారు. మరో వారంరోజుల్లో సార్వా వరి మాసూళ్ల నూరుశాతం పూర్తవుతాయని భావిస్తున్న తరుణంలో వాతావరణ మార్పులు రైతులను కలవరానికి గురిచేస్తున్నాయి.

మిల్లులకు తరలింపు

పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలతోపాటు మెట్ట మండలాల్లో ఎక్కడికక్కడ ఆరబెట్టిన ధాన్యం రాశులను బస్తాల్లో పట్టి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, లారీలు ద్వారా మిల్లులకు తరలిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఎక్కడ చూసినా పొలాల్లో నుంచి ఎడ్లబండ్లు బారులు తీరాయి. మరోవైపు ఇంకా తేమ అధికంగా ఉన్న ధాన్యం కళ్లాల్లోనే ఉంచిన రైతులు అవి తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు, బరకాలు కప్పుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను కొన్నిచోట్ల వరికోత యంత్రాలతో మాసూళ్లు చేస్తున్నారు.

వీడని తుఫాన్లు

సార్వా సాగు పూర్తయి పంటలు చేతికందే సమయంలో ఏటా తుఫాన్లు, అల్పపీడనాలు ఏర్పడి వర్షాలు కురిసి రైతులకు నష్టం కలుగచేయడం సర్వసాధారణంగా మారింది. ఈ ఏడాది ఇప్పటికే మూడు తుఫాన్లు, వాయుగుండాలు ఏర్పడగా, రైతులు వాటి నుంచి స్వల్పనష్టాలతో బయటపడ్డారు. మరో వారం పది రోజుల్లో సార్వా వరి మాసూళ్లు పూర్తి చేసుకుని ధాన్యం విక్రయించడం లేదా నిల్వ చేసి దాళ్వా సాగుపై దృష్టి పెట్టాలని రైతులు భావించారు. అయితే ఇప్పుడు బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిస్తే ఇటు సార్వా మాసూళ్లకు, అటు దాళ్వా నారుమళ్లు వేసేందుకు ఆటంకం ఏర్పడుతుంది. అయితే అక్కడక్కడ ఇప్పటికే వేసిన దాళ్వా వరినారు మడులకు మాత్రం సాగునీరు అందుతుంది.

తుఫాను ప్రభావంతో వర్షం

కాకినాడ సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచే చలిగాలులతో వాతావరణం మారింది. సాయంత్రానికి వర్షం మొదలై రాత్రి వరకు కురిసింది. కాకినాడతోపాటు చుట్టుపక్కల మండలాల్లో వర్షం పడింది. పనులు ముగించుకుని ఇళ్లకు చేరే సమయంలో వర్షం కురవడంతో జనం అవస్థలు పడ్డారు.

ధాన్యం చక్కబెట్టుకోవాలి : జేసీ

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం నేపథ్యంలో జిల్లాలో రైతులు కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని చక్కబెట్టుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా సూచించారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు వేగవంతంగా చేర వేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 98 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించిందన్నారు. రైతులకు రూ.225.46 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.221 కోట్ల ధాన్యం సొమ్ములు చెల్లించామని చెప్పారు.



గొల్లప్రోలు-బి.ప్రత్తిపాడు రోడ్డులో మిల్లులకు ఎడ్లబండ్లపై తరలిస్తున్న ధాన్యం

ముఖ్యమంత్రి చంద్రబాబుతో యనమల భేటీ



తుని సమస్యలపై చర్చ

తుని రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీనియర్ నేత, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమావేశమైన యనమల తుని నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రానున్న అయిదేళ్ల కాలంలో ఉపాధి, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించినట్టు యనమల తెలిపారు. ముఖ్యంగా తీర ప్రాంతంలో ఎస్ఈజెడ్ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతోపాటు బలవంతపు భూసేకరణతో నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరినట్టు తెలిపారు. పరిశ్రమల వల్ల సముద్రతీరం కలుషితమవుతోందని, దీనివల్ల సముద్రతీరంలో మత్స్య సంపద కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని సీఎంకు వివరించానని, ఇదే పరిస్థితి కొనసాగితే గంగపుత్రులు పూర్తిగా ఉపాధి కూలిపోయే పరిస్థితులు ఏర్పడతాయని సీఎం వివరించినట్టు చెప్పారు. వీటిపై సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

నేటి నుంచి 23 వరకూ డిపార్టుమెంటు పరీక్షలు

కాకినాడ రూరల్,డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులకు బుధవారం నుంచి ఈనెల 23 వరకూ నిర్వహించే డిపార్టుమెంటల్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జేసీ రాహుల్‌మీనా అధికారులను మంగళవారం ఆదేశించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై జేసీ రెవెన్యూ, పోలీస్, వైద్యఆరోగ్య, విద్యుత్ ఇతర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ పరీక్షల నిర్వహణకోసం కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెంలోని సాఫ్ట్ టెక్నాలజీ, కాకినాడ నగరంలోని ఎస్.అచ్యుతాపురం రైల్వే గేటు సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్లలో కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షలు ఉదయం 10 నుంచి 12గంటల వరకూ, మధ్యాహ్నం 3నుంచి 5గంటల వరకూ రెండు సెషన్లలో జరుగుతాయని తెలిపారు. ఉదయం పరీక్షకు అభ్యర్థులను ఉదయం 8.30 గంటల నుంచి 9.30 వరకూ, మధ్యాహ్నం జరిగే పరీక్షకు అభ్యర్థులను 1.30 నుంచి 2.30 గంటల వరకూ పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని జేసీ తెలిపారు. పరీక్షరాసే అభ్యర్థులు తమ వెంట హాల్ టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపుకార్డు తేవాలన్నారు. ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి కె.సురేష్, ఏఎస్‌వో నారాయణ, ఆర్డీవో కార్యాలయ ఏవో ఠాగూర్, తహశీల్దార్లు జితేంద్ర, కుమారి పాల్గొన్నారు.

శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్‌లో కొనసాగుతున్న ఐటీ దాడులు
7
లారీని ఢీకొని ట్రావెల్ బస్సు.. ఐదుగురికి గాయాలు

నేడు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం


బర్మా కాలనీలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయం



రాజమహేంద్రవరంలో

బర్మా కాలనీ

ఆకలి,
ఆశ్రయం..ఈ రెండు మనిషిని ఎంత దూరమైనా తీసుకువెళ్తాయి..ఉన్న ప్రాంతంలో ఉండలేని పేద బతుకులు పొట్ట చేతపట్టుకుని ఎందాకైనా వెళ్తాయి.. ఇలా ఒక ఊరి నుంచి మరో ఊరు, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రం, ఒక దేశం నుంచి మరో దేశం...ఎక్కడ తమకు పని దొరికితే, ఎక్కడ తమ ఆకలి తీరితే అక్కడికి వలస వెళ్లిపోతారు.. అలా 60 ఏళ్ల క్రితం బర్మా దేశం నుంచి పొట్ట కూటి కోసం వలస వచ్చిన వారితో రాజమహేంద్రవరంలో ఓ కాలనీయే ఏర్పడింది..

ఆ పేరుతో ప్రత్యేక ప్రాంతం....
60 ఏళ్ల క్రితం స్పిన్నింగ్ మిల్లులో పనికి
అక్కడ నుంచి వచ్చిన కుటుంబాలు
కొందరు తిరిగి వెళ్లిపోగా..
ఇంకా కొందరు ఇక్కడే..

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి):

ఈ భూమి ఎవరికీ శాశ్వతం కాదు. బతుకుదెరువు కోసం ఉన్న ఊరిని వదిలి అనేక మంది ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వెళ్లి అక్కడ స్థిరపడి జీవనం సాగిస్తున్నారు. పుట్టుక ఒక ప్రాంతంలో అయితే జీవితం మరొక ప్రాంతంలో ఉంటుంది. ఇలా మనిషి జీవన గమనంలో వలస కూడా ఓ భాగమైంది. 1966-1977లో రాజమహేంద్రవరం రూరల్ ప్రాంతంలో స్పిన్నింగ్ మిల్లును ఏర్పాటు చేశారు. ఈ మిల్లులో పని చేయడానికి మయన్మార్ (బర్మా) నుంచి 280 కుటుంబాలను తీసుకువచ్చారు. వారంతా రాజమహేంద్రవరంలో ప్రస్తుత బర్మా కాలనీలో ఉన్న ప్రాంతంలోను, క్వారీ సమీపంలోని మరొక ప్రాంతంలోను నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉండేవారు. అక్కడి నుంచి వారంతా స్పిన్నింగ్ మిల్లులో పనిచేసేందుకు వెళ్లేవారు. అదే విధంగా ఈ మిల్లులో పనిచేయడానికి సిలోను నుంచి కూడా చాలా మంది వచ్చి రాజమహేంద్రవరంలోనే స్థిరపడ్డారు. ఇలా బర్మా నుంచి వచ్చిన వారంతా రాజమహేంద్రవరంలోనే నివాసం ఉండటానికి అప్పట్లో క్వార్టర్లు కూడా నిర్మించారు. అవన్నీ ప్రస్తుతం కనుమరుగయ్యాయి. బర్మా నుంచి అప్పట్లో పెద్దవాళ్లు రావడంతో ఇక్కడకు వచ్చిన తర్వాతే పిల్లలు పుట్టడంతో వారంతా ఇక్కడే స్థిరపడిపోయారు. కొంతమంది బర్మాకు తిరిగి వెళ్లిపోయారు. అతి కొద్ది మంది మాత్రమే బర్మా కాలనీలో ఉండిపోయారు.

సంబంధాలు లేవు..

ప్రస్తుతం ఇక్కడ ఉన్నవారికి, బర్మాకు ఎటువంటి సంబంధాలు లేవు. అందరూ ఇక్కడి వారితో కలిసిపోయారు. తమ పూర్వీకులది బర్మా అని కూడా పూర్తిగా తెలియని పరిస్థితి. వారంతా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారుగా చెబుతారు. తొలినాళ్లలో బర్మా సంప్రదాయాలను వారు పాటించినప్పటికీ కాలక్రమేణా మారిపోయారు. కనీసం ఆ భాష తెలిసిన వారు కూడా లేరు. కానీ ఒకప్పటి బర్మా నుంచి 280 కుటుంబాలు మాత్రం రాజమహేంద్రవరం వచ్చి ఇక్కడే ఉండేవారని మాత్రం చెబుతారు. అందుకే బర్మాకాలనీకి ఈ పేరువచ్చింది. అదేవిధంగా క్వారీ రోడ్డులో కూడా వారు ఉండడంతో అక్కడ కూడా ఓ బర్మా కాలనీ ఉంది.

శ్రీలంక కూడా..

రాజమహేంద్రవరంలో లూథర్‌గిరి వెనుక ప్రాంతంలో క్వారీ గోతుల్లో నీటి మధ్యలో కొంత ప్రాంతంలో స్థానికులు గుడిసెలు వేసుకుని జీవనం సాగించేవారు. ఈ ప్రాంతం లంకను తలపించే విధంగా ఉండేదని దానిని శ్రీలంకగా నామకరణం చేసుకున్నారు. శ్రీలంకతో దీనికి ఎటువంటి సంబంధం లేకపోయినా పేరు మాత్రం పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో బిల్డింగ్‌లు వచ్చాయి, వర్షం పడితే ఇప్పటికి ఈ ప్రాంతం చుట్టూ మునిగి లంక మాదిరిగా తయారవుతుంది..

తెలుగు సంప్రదాయాలు.. ఆచార వ్యవహారాలు

వలసదారులు వచ్చి స్థిరపడిన ప్రాంతాలకు ఆయా దేశాల పేర్లు పెట్టి స్థానిక ప్రజలే పిలవడంతో అప్పటి నుంచి ఆ పేర్లనే కొనసాగిస్తున్నారు. ఇక్కడ మిగిలిన పోయిన బర్మా వాసులు తెలుగు సంప్రదాయాలను, స్థానిక ఆచారాలను కొనసాగించడం ప్రారంభించారు. ఇప్పుడు పూర్తిగా తెలుగు వాళ్లలో కలిసిపోవడంతో పేరుకే బర్మా కాలనీ అయినా ఇక్కడ బర్మా నుంచి వచ్చిన వారెవరో, స్థానికులు ఎవరో తెలిసే పరిస్థితి ఉండదు. అలాగే చాలా ఏళ్ల క్రితం నుంచి స్థానికంగానే పెళ్లి సంబంధాలు కూడా కుదుర్చుకోవడంతో అంతా ఒక్కటిగానే కలిసి మెలిసి ఉంటున్నారు.



నటనలో ఎదిగి... పాత్రల్లో ఒదిగి...

తెలుగుచిత్ర పరిశ్రమలో గయ్యాళి పాత్ర, అత్త పాత్ర, తల్లి పాత్రల్లో ఇమిడిపోయి ఆ పాత్రలకే ప్రాణం పోసిన మహానటి సూర్యకాంతం. ఆమె పాత్రల్లో కనిపించే గాంభీర్యం, పాత తరం నాటి ముచ్చట్లెన్నో ఆయా సినిమాల్లో కనిపిస్తాయి. ఆమె నటించిన సినిమా పాత్రల వల్ల సూర్యకాంతం అనే పేరు పెట్టుకునేందుకు చాలామంది వెనకడుగు వేసేవారంటే ఆమె వేసిన పాత్రలు ఎంత బలమైన ప్రభావం చూపించాయో అర్థం చేసుకోవచ్చు. అలాంటి సహజ నటి సూర్యకాంతం జన్మించింది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సమీపంలోని వెంకట కృష్ణరాయపురంలోనే. ఆమె వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం..



నటనలో ఓ చరిత్ర సూర్యకాంతం
750 చిత్రాల్లో నటించి అనేక పాత్రలకు జీవం పోసిన నటి
కాకినాడ సమీపంలోని వెంకటకృష్ణరాయపురం సొంతూరు.... నేడు ఆమె వర్ధంతి



(ఆంధ్రజ్యోతి-మండపేట)

సూర్యకాంతం కాకినాడ సమీపంలోని వెంకటకృష్ణరాయపురంలో 1924 అక్టోబరు 28న పొన్నాడ వెంకటరత్నమ్మ-అనంతరామయ్య దంపతులకు 14వ సంతానంగా జన్మించారు. సరైన వైద్య సదుపాయాలు లేని కారణంగా పుట్టినవారిలో పది మంది మరణించారు. దీంతో ఈ 14 మందిలో మిగిలింది నలుగురే. వీరిలో చివరి సంతానం సూర్యకాంతం. చిన్నతనం నుంచి సూర్యకాంతం కుటుంబంలో గారాబంగా పెరిగారు. చిన్నతనం నుంచి నటన, సంగీతం మీద ఆసక్తి ఉండేది. పైగా నవలలు అధికంగా చదివేవారు. ఆమె తొలి నుంచి గడసరి. చిన్నతనంలోనే అంటే 8వ తరగతి చదువుతుండగా తండ్రి చనిపోయారు. ఇక పాఠశాలలో వార్షికోత్సవ సందర్భాల్లో సూర్యకాంతం నాటకాల్లో నటించారు. పాటలు పాడటం ఇష్టం. కాకినాడలో బాలాంత్రపు ప్రభాకర రావు హనుమాన్ నాటక మండలి పేరిట కేవలం ఆడపిల్లలతోనే వేసే సతీసక్కుబాయి, చింతామణి, శ్రీకృష్ణతులాభారం వంటి అనేక నాటకాల్లో ఆమె వేషాలు వేశారు. అలా రంగస్థలంలో మంచిపేరు తెచ్చుకున్నారు. 1945లో జెమిని సంస్థ చంద్రలేఖ చిత్రాన్ని భారీ తారాగణంతో తమిళం, హిందీ భాషల్లో నిర్మిం చే సమయంలో నటన మీద ఆసక్తి ఉన్న కళాకారులను, నృత్యకళాకారులను పత్రికాముఖంగా ఆహ్వానించారు. ఆ ప్రకటన చూసిన హనుమాన్‌నాట్యమండలి సభ్యులు దాసరి సుభద్ర, యండమూరి సుభద్ర మద్రాసుకు వెళుతూ సూర్యాకాంతాన్ని కూడా వెంట తీసుకువెళ్లారు. వారితో కలిసి వెళ్లిన సూర్యకాంతం మద్రాసు జెమిని స్టూడియోలో డ్యాన్సర్‌గా నెలవారి జీతానికి చేరి అలా చంద్రలేఖలో సినిమాలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన డ్రమ్‌డాన్స్ సన్నివేశంలో సూర్యకాంతం 500 మందితో కలిసి పాల్గొన్నారు. తొలి నుంచి ఆమెకు హిందీ చిత్రంలో నటించాలనే కోరికుండేది. జెమిని స్టూడియోలో హిందీ సినిమాలు ఎక్కువగా నిర్మించేవారు. గాయని పి. లీలతో పరిచయమైన సూర్యకాంతం ఆ తర్వాత 1946లో పి.పుల్లయ్య దర్శకత్వం వహించిన నారదనారది చిత్రంలో చిన్నపాత్రలో నటించింది. దాంతో ఆమె జెమిని సంస్థలో నెలవారీ జీతానికి కాంట్రాక్టు వద్ద పనిచేసే సూర్యకాంతం అందులో నుంచి మానేసి 1946లో సారధి స్టూడియో ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో నిర్మించిన గృహప్రవేశం చిత్రంలో మూగపిల్ల పాత్ర వేసింది. అలాగే 1950లో నిర్మించిన సాధన వారు నిర్మించిన సంసారం చిత్రంలో రేలంగి తల్లిగా నిర్దయ కలిగిన అత్త పాత్రలో తొలిసారి సూర్యకాంతం నటించింది. కేవలం 25 ఏళ్ల వయస్సులో ఆమె 60 ఏళ్ల అత్త పాత్రలో నటించింది. సూర్యకాంతానికి 1950వ సంవత్సరంలో పెద్దిబొట్ల చలపతిరావుతో వివాహం జరిగింది. ఆయన మద్రాసులో న్యాయవాది. ఆయనకు సూర్యకాంతం నాటకాల సమయంలో పరిచయమైంది. 1951లో రాజేశ్వరి ఫిలిమ్స్ కంపెనీ అధినేత, నిర్మాత కేబీ నాగభూషణం నిర్మించిన సౌదామిని చిత్రంలో సూర్యకాంతం హీరోయిన్ పాత్రకు ఎంపికయ్యారు. అప్పటిలో దురదృష్టవశాత్తూ ఆమె కారు ప్రమాదంలో గాయపడడంతో ఆ పాత్రకు వరలక్ష్మిని ఎంపిక చేశారు. ఆ తర్వాత ఎక్కువగా తెలుగు సినిమాల్లో అత్త, తల్లి గయ్యాళి పాత్రలను పోషించారు. పెళ్లిచేసి చూడు, గుండమ్మకథ మాయాబజార్, తోడికోడళ్లు, అప్పుచేసిపప్పు కూడు, వెలుగునీడలు, ఇద్దరు మిత్రులు, ఆత్మబంధువు, కులగోత్రాలు, దాగుడుమూతలు, చిరంజీవులు, కన్యాశుల్కం వంటి చిత్రాల్లో వైవిధ్య పాత్రలను ఆమె పోషించారు. తాము నిర్మించే చిత్రాల్లో సూర్యకాంతం పాత్ర ఉందా లేదా అని నిర్మాతలు దర్శకుడిని అడిగేవారంటే సూర్యకాంతం నటన గురించి అర్థం చేసుకోవచ్చు. సూర్యకాంతం జీవితంలో గుండమ్మకథ చిత్రం ఒక మైలురాయిగా చెప్పవచ్చు. ఆమె సినిమాలో గయ్యాళే తప్ప నిజజీవితంలో దయ, దాణగుణం కలిగి ఉండేది. ఎందరో అనాథ పిల్లలకు, విద్యా సంస్థలకు, అనాథలకు, గ్రంథాలయాలకు ఆర్థికసాయం చేసేది. చిన్నతనంలోనే ఆమె చదువుకు స్వస్తిచెప్పి సినిమాల్లో నటించారు. ఆమె 50 తమిళ చిత్రాల్లో నటించారు. ఐదు భాషల్లో మాట్లాడేది. మొత్తం 750 చిత్రాల్లో నటించారు.

ఆమెకు చివరి దశలో తిరుపతి శ్రీవేంకటేశ్వర మహిళా విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేట్ అందించి సత్కరించారు. ఆమె మంచి వ్యాపారవేత్తగా కూడా రాణించారు. పాత ఇళ్లను కొనుగోలు చేసి వాటిని ఆధునికీకరించి మంచి ధరకు విక్రయించేవారని చెబుతారు. 1993లో ఆమె షుగర్ వ్యాధితో బాధపడుతూ మూత్రపిండాలు దెబ్బతినడంతో 1994 డిసెంబరు 18న మరణించారు. ఆమె తన 70వ ఏట కన్నుమూశారు. ఆమె లేకపోయినా అలనాటి పాతకాలపు సినిమాల్లో వేసిన పాత్రలు నేటికీ సజీవంగానే మనకు కనిపిస్తున్నాయి.



రాజమహేంద్రవరం అర్బన్, (ఆంధ్రజ్యోతి):

హక్కులు ఉన్నాయి కానీ అమలే జరగడం లేదని మైనార్టీల ఆవేదన
ప్రభుత్వాలు పట్టించుకోవాలని వేడుకోలు..

మైనార్టీల్లో ప్రధానమైన ముస్లింలు, క్రిస్టియన్లు, జైనులు, సిక్కులు, పార్శీలు వంటి ఎందరో మన సమాజంలో ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం ముస్లింలు, క్రిస్టియన్లు కావడంతో వారి హక్కులకు సంబంధించి ఆయా వర్గాల నుంచి కొన్ని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనే ఆవేదన వారిలో ఉంది.

- నేడు మైనార్టీల హక్కుల దినోత్సవం

మన దేశంలో అత్యధిక సంఖ్యలో హిందువులు ఉన్నారు..మిగిలిన మతాలకు చెందిన వారు మైనార్టీలుగా ఉన్నారు. రాజ్యాంగపరంగా దేశంలో ప్రతి పౌరుడికి సమాన హక్కులు ఉన్నప్పటికీ మైనార్టీల రక్షణకు కొన్ని ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. అయితే మైనార్టీల హక్కులను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే ఆవేదన ఆయా వర్గాల్లో వ్యక్తమవుతోంది.



మా హక్కుల మాటేంటి?

ముస్లింల మాటిది..

ముస్లిం మైనార్టీలకు సంబంధించి వారిని రెండు రకాలుగా చెబుతున్నారు. భాషా పరమైన మైనార్టీలు, మత పరమైన మైనార్టీలుగా ఉన్నారు. ఆర్టికల్ 2 ప్రకారం మైనార్టీల హక్కులకు ప్రాంతీయ, జాతీయ, భాష, రంగు, మతం, ఆస్తి వంటివి ఆధారంగా వివక్ష ఉండకూడదు. అలాగే ఆర్టికల్ 27 ప్రకారం రెలీజియన్ పరంగా మైనార్టీలను రక్షించడానికి ఒక చట్టం ఉంది. కానీ ఇవి అంతంతమాత్రమే తప్ప సరిగా అమలు జరగడం లేదనే అభిప్రాయం వారిలో వ్యక్తమవుతోంది. దీంతోపాటు మైనార్టీలపై వివక్ష ఎక్కువైందనే భావన ఉంది.. ప్రధానంగా బలహీనమైన ముస్లిం మైనార్టీ వర్గం నూర్ బాషా దూదేకుల వర్గం మరీ వివక్షకు గురవుతోందని ఆ వర్గానికి చెందిన నాయకులు వాపోతున్నారు. ముస్లింలంతా విద్య, ఉపాధి, ఆరోగ్య సంరక్షణలో సమానత్వం కోరుకుంటున్నారు. దీంతో పాటు కలెక్టర్ ప్రతి నెలా రివ్యూ సమావేశం పెట్టి వారి సాధక బాధకాలు వినాల్సి ఉందని, కానీ కొన్నేళ్లుగా ఇది జరగడంలేదని అంటున్నారు. ప్రభుత్వానికి ముస్లిం సమాజం సమస్యలు తెలియజేయాలి, ఆర్థిక, సామాజిక ఇబ్బందులపై సమీక్ష జరపాలి. ప్రతి నెలా ప్రభుత్వానికి ఒక రిపోర్టు ఇవ్వాలి. దీన్ని పునరుద్ధరించాలి అని ఆయా వర్గాలు కోరుతున్నాయి.

రిజర్వేషన్లు పెంచాలని..

క్రిస్టియన్లలో దళిత క్రిస్టియన్లు బీసీ సీ కేటగిరీలోకి రావడంతో వారికి 1 శాతం రిజర్వేషన్లు మాత్రమే వర్తిస్తున్నాయి. దీనివల్ల ప్రయోజనం చాలా తక్కువ అనేది వారి భావన. దళిత క్రిస్టియన్లకు బీసీ సీ హోదా ఇవ్వడంతో చాలా మంది విద్య, ఆర్థికపరమైన వాటిల్లో వెనుకబడి ఉంటున్నారని చెబుతున్నారు. దళిత క్రిస్టియన్లకు 5 శాతం వరకూ రిజర్వేషన్లు పెంచితే ప్రయోజనం ఉంటుందని, తమ హక్కులకు రక్షణ లభిస్తుందని భావిస్తున్నారు. గతంలో క్రిస్టియన్ మైనార్టీ వైద్య, విద్యా సంస్థలకు ప్రభుత్వాలు గ్రాంటు ఇచ్చేవి. కొన్నేళ్ల క్రితం గ్రాంట్ ఇన్ ఎయిడ్ పోస్టులు తీసేయడం తమకు ఇబ్బందికరంగా మారిందని వారు చెబుతున్నారు.



5 శాతం రిజర్వేషన్లు పెంచాలి



మైనార్టీ స్కూళ్లలో ఎయిడెడ్ పోస్టులు ఉండేవి. ఇప్పుడు వాటిల్లో పోస్టులను ఎత్తేశారు. మళ్లీ పునరుద్ధరించాలి. దళిత క్రిస్టియన్లకు బీసీ సీ హోదా ఇవ్వడంతో తమ హక్కులకు భంగం వాటిల్లుతోంది. ఐదు శాతం రిజర్వేషన్లు పెంచాలి. ఉపాధి అవకాశాలు కల్పించాలి..

పి.ఎర్నెస్ట్ మోజెస్, పాస్టర్స్ ఫెలోషిప్ రీజియన్ చైర్మన్

సమాన అవకాశాలు కల్పించాలి



ముస్లిం జనాభా దామాషా ప్రకారం ఉపాధి అవకాశాలు కల్పించాలి. విద్యలో ప్రోత్సాహం ఉండాలి. రిజర్వేషన్లు 8 శాతం లేదా 10 శాతం పెంచి సమాన అవకాశాలు కల్పించాలి. ఇస్లామిక్ బ్యాంకులు పెట్టాలి. వడ్డీలు లేని రుణాలు అందజేయాలి. **షేక్ సుభాన్, నూర్ బాషా సంఘం**



సామర్లకోటలో టిడ్కో లబ్ధిదారులతో మాట్లాడుతున్న చైర్మన్ అజయ్‌కుమార్

'టిడ్కో గృహాలను నిర్లక్ష్యం చేసిన వైసీపీ'

పెద్దాపురం/సామర్లకోట డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం శివారు వాలుతిమ్మాపురం సమీపంలో నిర్మించిన టిడ్కో గృహాలను, సామర్లకోటలోని గృహాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ టిడ్కో గృహాలను గత వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా నిర్వీర్యం చేసిందన్నారు. లబ్ధిదారులకు, బ్యాంకర్లకు మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్నట్టు పేర్కొన్నారు. టిడ్కో గృహాల్లో నివాసముంటున్న ప్రజల సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. టిడ్కో గృహాలు నివాస యోగ్యంగా ఉన్నాయా లేదా అనేదానిపై సాంకేతిక నిపుణుల బృందంతో కమిటీని వేశామన్నారు. గృహ సముదాయల వద్ద పూర్తిస్థాయిలో అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలువురు కాలనీ వాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసురావడంతో వాటిని సాధ్యమైనంత తొందర్లో పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో 'కౌడా' చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, టిడ్కో అధికారులు పాల్గొన్నారు.


మోతుగూడెంలో ఉదయం తొమ్మిది గంటలైనా వీడని మంచు


చలి మంట కాగుతున్న గిరిజనులు

మంచు దుప్పటి...

మోతుగూడెం/రాజవొమ్మంగి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు గ్రామాలను పొగ మంచు దట్టంగా కమ్మేసింది. చింతూరు మండలం మోతుగూడెంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల వరకు భానుడు కనిపించలేదు. దీంతో వాహనచోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. చలి తీవ్రతకు గిరిజనులు వణుకుతున్నారు. మంట వేసుకుని చలి నుంచి రక్షణ పొందుతున్నారు. మరోవైపు రాజవొమ్మంగిలోనూ మంచుదుప్పటి పరుచుకుంది. శివాలయం కొండపై నుంచి చూస్తే గ్రామం మొత్తం మంచు తెరల్లో ఉన్నట్టు కనిపించింది.

రాళ్లకట్టు... జారేట్టు!

సామన్యుడైనా, సంపన్నుడైనా...
అధికారి అయినా, ప్రజాప్రతినిధి అయినా....
ఎవరైతే నాకేంటి అంటూ వెక్కిరిస్తోంది ఈ గొయ్యి. కాకినాడ జిల్లా రౌతులపూడి శివారు రాళ్లకట్టు సమీపంలో ఉంది ఇది. ఐదు రోజుల క్రితం ఓ స్కూలు బస్సు, రెండు రోజుల క్రితం ఒక ఆటో ఇదే ప్రదేశంలో తిరగబడ్డాయి. మంగళవారం రౌతులపూడి మండలంలోని ఉప్పంపాలెంలో రెవెన్యూ సదస్సుకు వెళ్తున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు వాహనం కూడా ఈ గోతిలో దిగబడిపోయింది. కొందరు వ్యక్తులు దిగి తోశారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి)



పోలీసులపై ఎటాక్ చేసిన

దొంగ నోట్ల ముఠా అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు

- పోలీసుల అదుపులో 13 మంది
- నిందితులు రాజమహేంద్రవరం, భీమవరం వాసులే
- పరారీలో ఐదుగురు
- స్విఫ్ట్ కారు, నాలుగు బైక్‌లు స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తప్పించుకుందామని పోలీసులపై ఎటాక్ చేస్తే అసలు డొంక కదిలింది.. భీమవరం కేంద్రంగా సాగుతున్న పెద్ద దొంగ నోట్ల ముఠా బయటపడింది. రాజమహేంద్రవరంలో ఈ నెల 12న అర్ధరాత్రి శ్రీకాకుళం పోలీసులపై ఎటాక్ చేసి దొంగ నోట్ల కేసులో నిందితుడు రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్ రెడ్డిని తీసుకు పోయారు. ఈ సంఘటన సంచలనంగా మారింది. పోలీసులపై ఎటాక్ చేసి నిందితుడిని ఎత్తుకుపోవడంపై ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. మొత్తం 18 మంది పోలీసులపై ఎటాక్ చేసి అదుపులో ఉన్న నిందితుడిని ఎత్తుకుపోయినట్టు గుర్తించారు. అనంతరం తీగలాగితే దొంగనోట్ల ముఠా గుట్టు బయటపడింది. వారిలో 13 మందిని ప్రకాష్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజమహేంద్రవరం మహిళా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం విలేకరులకు అడిషనల్ ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు, సెంట్రల్ జోన్ డీఎస్పీ కే.రమేష్ బాబు, ప్రకాష్‌నగర్ సీఐ బాజిలాల్ వివరాలు వెల్లడించారు.

అసలు ఏం జరిగిందంటే...

శ్రీకాకుళం జిల్లా సిగడం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితుడిగా ఉన్న రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్ రెడ్డిని ఈనెల 12న రాత్రి పోలీసులు భీమవరంలో అరెస్టు చేశారు. ఇదే కేసులో రెండో నిందితుడిగా ఉన్న కృష్ణమూర్తి కోసం రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌టవర్ లోకేషన్ వెరిఫై చేయడానికి వచ్చారు. శ్రీకాకుళం పోలీసులు ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్‌కి వచ్చి తిరిగి ప్రభాకర్‌ను తీసుకుని వెళ్లిపోతుండగా రాజమహేంద్రవరం ఆర్‌టీసీ కాంప్లెక్స్ రోడ్డు వీఎల్‌పురం సర్కిల్ లిమిట్స్‌లో కొంతమంది రెండు కార్లు, నాలుగు బైక్‌లపై వచ్చి పోలీసులపై ఎటాక్ చేసి రాపాక ప్రభాకర్‌ను తీసుకుని వెళ్లిపోయారు. దీనిపై అదే రోజు రాత్రి ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ బాజీలాల్ కేసు నమోదు చేశారు. పోలీస్‌లపై ఎటాక్ చేసిన ముఠా ఆచూకీ కోసం ఆరు బృందాలను రంగంలోకి దింపి విస్తృతంగా గాలించారు. ఎటాక్ చేసినవారంతా దొంగనోట్ల ముఠాకు చెందిన వారని గుర్తించి అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం దెయ్యాలతిప్పకు చెందిన నల్లి శశికాంత్, బ్రిడ్జిపేట గునుపూడికి చెందిన పోతుల యాపేతు అలియాస్ వినోద్, గునుపూడి అంబేడ్కర్ నగర్‌కు చెందిన తాళ్ళ జాన్సన్ రాజు, బ్రిడ్జిపేటకు చెందిన పెద్దపాటి మహంకాళి, నేతపూడి క్రాంతి కుమార్, మొగల్తూరు మండలం కవురు వారిపాలెం అంబేడ్కర్ కాలనీకి చెందిన గండుపల్లి కామరాజు, రాజమహేంద్రవరం నెహ్రూనగర్‌కు చెందిన గెద్దాడ శ్రీనాథ్, వై.జంక్షన్ సుబ్బారావు పేటకు చెందిన తురుబిల్లి రామసతీష్, తాడితోటకు చెందిన బుంగా తేజ అలియాస్ ఏలియా, గాంధీపురానికి చెందిన ఇడిసిమళ్ళ సతీష్, ఏవీఏ రోడ్డుకు చెందిన బాలుడు, బుచ్చియ్యపేటకు చెందిన పీతల చిరంజీవి, లక్ష్మీవారపుపేటకు చెందిన నక్కా వెంకట దుర్గా శ్రీఅఖిల్‌లను అరెస్టు చేశామన్నారు. వారితో పాటు స్విఫ్ట్ కారు, 4 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ కేసులో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. చాలాకాలంగా వారంతా ముఠాగా ఏర్పడి దొంగ నోట్లు మారుస్తున్నట్టు సమాచారం. దీనిలో భాగంగా భీమవరంలో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకున్న వెంటనే అటు భీమవరం ముఠా.. ఇటు రాజమహేంద్రవరం ముఠా రంగంలోకి దిగి నిందితుడిని తీసుకెళ్లిపోయారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్ బాబు పర్యవేక్షణలో కేసును ఛేదించిన సీఐ బాజీలాల్, ఎస్ఐ శశిప్రసాద్, హెడ్‌కానిస్టేబుళ్లు ఎన్. వెంకట్రావు, సీహెచ్.శ్రీనివాసరావు, క్రైమ్ కానిస్టేబుల్ ఎస్.వీరబాబు, వి.నాగరాజు, టి.వరహాల బాబు, బి.రాజబాబును ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారని అడిషనల్ ఎస్పీ తెలిపారు.

ఆరుగురు రాజమహేంద్రవరం వారే...

దొంగ నోట్ల ముఠా కేసులో నిందితుడిని తప్పించేందుకు శ్రీకాకుళం పోలీస్‌లపై ఎటాక్ చేసిన వారిలో ఆరుగురు రాజమహేంద్రవరానికి చెందిన వారే కావడం విస్మయానికి గురిచేస్తుంది. వారంతా 19 నుంచి 32 ఏళ్ల వారే.

కొట్టి... చీరతో చేతులు కట్టి!

దూబచర్లలో దోపిడీ దొంగల బీభత్సం

24 గ్రాముల బంగారం, రూ.30వేల నగదు చోరీ

నల్లజర్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో మంగళవారం తెల్లవారుజామున దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించి 24 గ్రాముల బంగారం, రూ.30వేల నగదు దోచుకెళ్లారు. స్థానికుల వివరాల ప్రకారం.. దూబచర్ల గ్రామానికి చెందిన విశ్రాంత వ్యవసాధికారి చీమకుర్తి వీరభద్ర అప్పల కృష్ణమూర్తి తన భార్య లక్ష్మీకుమారితో కలిసి పాత ఇండియన్ బ్యాంకు ఉన్న ఇంట్లో జీవిస్తున్నారు. లక్ష్మీకుమారి అనారోగ్యంతో మంచం పైనే ఉంటున్నారు. ఆమెకు సహాయకురాలిగా అదే గ్రామానికి చెందిన జుత్తింగ పెద్దింట్లను నియమించుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కృష్ణమూర్తి ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అక్కడే ఉన్న పెద్దింట్ల.. ఎవరు అంటూ ప్రశ్నించేలోగా ఆమెను కొట్టి చీరతో చేతులు కట్టేశారు. ఆపై కృష్ణమూర్తి చేతులను సైతం తాళ్లతో కట్టి బంధించి లక్ష్మీకుమారి మెడలో బంగారు ఆభరణాలతోపాటు బీరువా పగులగొట్టి ఆభరణాలు, రూ.30 వేల నగదు దోచుకుని వెళ్లిపోయారు. సంఘటన నుంచి తేరుకున్న కృష్ణమూర్తి 112కి కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీ దేవకుమార్, దేవరపల్లి సీఐ బీస్ నాయక్, ఎస్ఐ సోమరాజు, రమేష్, బాలాజీ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వేలిముద్రలు సేకరించి, డ్యాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు



అనారోగ్యంతో మంచంపై ఉన్న లక్ష్మీకుమారి

కాపురానికి రానివ్వకుండా వేధింపులు

భర్త ఇంటి ముందు మహిళ నిరసన దీక్ష



కొమరాజులంకలో దీక్ష చేపట్టిన బాధితురాలు

రావులపాలెం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న తరుణంలో అత్తింటి వారు కాపురానికి రానివ్వకుండా వేధిస్తున్నారని తమకు న్యాయం చేయాలంటూ ఓ వివాహిత భర్త ఇంటి ముందు నిరసన దీక్ష చేపట్టింది. యువతి, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం కొమరాజులంకకు చెందిన గంధ్రోతు హరికృష్ణ, యామన ఝాన్సీ 6 నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అత్తారింటికి వెళ్లగా అత్త గంధ్రోతు వెంకటలక్ష్మి, మావయ్య సత్తిపండులు ఝాన్సీ మెడలో తాళి తెంపి మీది వేరే కులం, మాది వేరే కులం నువ్వు కాపురానికి ఎలా వస్తావంటూ కొట్టి దుర్భాషలాడారు. దీంతో మనస్తాపానికి చెందిన బాధితురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను స్థానిక ప్రవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రాణాలతో బయటపడింది. కాగా కాపురానికి తీసుకుని వెళ్లాలని ఎన్నిసార్లు వేడుకున్నా, పెద్ద మనుషులతో మాట్లాడించినా ఎటు వంటి స్పందన లేకపోవడంతో ఝాన్సీ తనకు న్యాయం చేయాలంటూ మంగళవారం భర్త గంధ్రోతు హరికృష్ణ ఇంటి ముందు నిరసన దీక్ష చేపట్టింది. తనకు న్యాయం జరిగే వరకూ దీక్ష కొనసాగిస్తానని పేర్కొంది. బాధితురాలికి అండగా పలువురు మహిళలు చేరుకుని ఝాన్సీని కాపురానికి తీసుకుని వెళ్లాలంటూ నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ చంటి సిబ్బందితో అక్కడికి వెళ్లి వారితో చర్చించారు. తనకు న్యాయం జరగాలని శాంతియుతంగా దీక్ష చేస్తున్నానని న్యాయం జరిగే వరకూ కొనసాగిస్తానని ఝాన్సీ తెలిపింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

బాధితురాలకు అన్ని విధాలా న్యాయం జరిగే వరకూ అండగా నిలబడి పోరాడతామని రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు మట్టా వీరబాబుగౌడ్ అన్నారు. బాధితురాలి దీక్ష వద్దకు ఆయన చేరుకని అండగా నిలబడ్డారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గంధ్రోతు హరికృష్ణ ఝాన్సీని పెళ్లి చేసుకుని కాపురానికి తీసుకెళ్లకపోవడం దారుణమన్నారు. అత్తమామలు ఆమెపై చేసిన దాడిని ఖండిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ దృష్టికి విషయాన్ని తీసుకుని న్యాయం జరిగేలా పోరాటం చేస్తామన్నారు.

లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

ఐదుగురికి గాయాలు

తేటగుంట హైవేపై ఘటన

తుని రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం లారీని ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటన ఉలికిపాటుకు గురిచేసింది. కాకినాడ జిల్లాలో ఓ ట్రావెల్ బస్సు నిర్వాహకుడు కాశీ యాత్ర కోసం ప్రయాణికులను ఎక్కించుకుని బయలుదేరారు. అన్నవరం దేవస్థానం వద్ద దర్శనం అనంతరం సింహాచలం వెళ్లేందుకు పయన్మై ఐదుకిలోమీటర్లు వెళ్లేసరికి ప్రమాదం జరిగింది. తేటగుంట వద్ద లారీ ఎదురుగా ఉన్న హైవే వ్యాన్‌ని ఢీకొనగా అదే లారీని టూరిస్ట్ బస్సు వెనుక నుంచి ఢీకొంది. భారీ శబ్దంతో పాటు కేకలు వినిపించడంతో స్థానికులు గుమిగూడారు. అప్పటికే బస్సులో చెల్లాచెదురుగా పడి ఉన్న ప్రయాణికులను ఎమర్జెన్సీ విండో ద్వారా బయటకు తీసుకొచ్చేందుకు పోలీసులు, హైవే మెయిన్ సిబ్బంది శ్రమించారు. బస్సులో 36 మంది ప్రయాణికులు ఉండగా ఐదుగురికి గాయాలవగా మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వెంకట్రావు, హేమా, సత్యవతి, శ్రీరాములు, పార్వతిలను హైవే అంబులెన్స్ సహాయంతో ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు వైద్యం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు.



బస్సులో ఇరుక్కున్నవారిని బయటకుతీస్తున్న దృశ్యం



గాయాలపాలైన ప్రయాణికులు

శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్‌లో

కొనసాగుతున్న ఐటీ దాడులు

పెద్దాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. సుమారు 4రోజులుగా ఈ దాడులను ఐటీ అధికారులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఫ్యాక్టరీ, ఇళ్లు బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి ఆస్తులపై తనిఖీలు చేపట్టారు. పలు కీలక పత్రాలు, ఫైళ్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. అలాగే కంపెనీకి సంబంధించిన ఆడిటర్లు, లీగల్ అడ్వైజర్లు, దస్తావేజు లేఖర్లను విచారించినట్లు తెలిసింది. అర్ధరాత్రి వరకూ ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల యాజమాన్యం భారీగా పలు ప్రాంతాల్లో భూములు, వాణిజ్య స్థలాలు కొనుగోలు చేసినట్లు ఐటీ అధికారులు గుర్తించినట్టు సమాచారం. దీంతో అందుకు సంబంధించిన డాక్యు మెంట్లు, భూముల విలువ తదితర వివరాలను ఆరాతీస్తున్నట్టు తెలుస్తోంది. బ్యాంకు లాకర్లను సైతం తనిఖీ చేసినట్టు సమాచారం. ఐటీ అధికారులు ఇప్పటివరకూ ఎంతమేర తనిఖీలు చేశారు, ఎంత మొత్తంలో నగదు, బంగారు గుర్తించారు. లెక్కల్లో లేని డబ్బు ఎంత గుర్తిం చారు అనే విషయాలు మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. ఇన్ని రోజులుగా ఐటీ సోదాలు జరగడంతో పెద్దాపురం పట్టణంలో ఇదే విషయం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా భారీగా బంగారం, లెక్కల్లో లేని నగదును ఐటీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. లెక్కల్లో పలు వ్యత్యాసాలను గుర్తించినట్లు సమాచారం. దానికి సంబంధించిన వివరాలను ఐటీ అధికారులు ఆరాతీస్తున్నట్లు తెలుస్తోంది. ఎంత మేర బంగారం కొనుగోలు చేశారు..? ఎక్కడ కొనుగోలు చేశారు..? అనే విషయంపై సంబంధిత దుకాణాలను సైతం విచారణ చేయనున్నట్లు సమాచారం. శ్రీలలితా యాజమాన్యానికి సంబంధించిన గృహాల్లో నివాసం ఉంటున్న వారిని ఫ్యాక్టరీకి పిలిచి విచారించినట్లు తెలుస్తోంది. అలాగే ఈ దాడులు మరో రెండు రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

'పదోన్నతుల సీనియారిటీ లిస్టును వెబ్‌సైట్‌లో పొందుపరిచాం'

కాకినాడ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పరిధిలో గల మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల సీనియారిటీ లిస్టును **deoeg.org** వెబ్‌సైట్‌లో పొందుపరచినట్టు కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే సదరు అభ్యర్థులు కాకినాడ డీఈవో కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలలోపు సమర్పించాలని ఆయన చెప్పారు.

జేఎన్టీయూకేలో అంతర్గత బదిలీలు

జేఎన్టీయూకే, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు జేఎన్టీయూకేలోని పలువురు అధికారులకు అంతర్గత బదిలీలు చేస్తూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేయగా వీసీ సమావేశహాల్లో వారందరికీ వీసీ నియామక ఉత్తర్వులను అందజేశారు. స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ మాలోతు రమేష్‌ను స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, ప్రొఫెసర్ కె.పద్మప్రియను స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, ఏఎం ప్రసాద్‌ను ఐఎస్‌టీ, కె.రామును అడ్మిషన్స్ విభాగాల ఇన్‌చార్జి డైరెక్టర్లుగా నియమించారు. ప్రొఫెసర్ డి.కోటేశ్వరరావును బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సు బీవోఎస్ చైర్మన్‌గా, ఈసీఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బీటీ కృష్ణను ఎంటెక్ వీఎల్‌ఎస్ఐ ప్రోగ్రామ్ బీవోఎస్ చైర్మన్‌గా నియమిస్తూ సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని వీసీ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

19, 20న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు

పిఠాపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 19,20వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు జరగనున్నాయి. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 100మందికి పైగా బాక్సర్లు, మరో 50మంది కోచ్‌లు, టీమ్ మేనేజర్లు, టెక్నికల్ స్టాఫ్ హాజరుకానున్నారు. ప్రతిభ కనబరిచే బాక్సర్లను జనవరిలో ఉత్తరప్రదేశ్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని.. బాక్సర్లు, సహాయకులకు భోజన, వసతి ఏర్పాట్లు చేసినట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

కడియం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తన భార్యను కత్తితో నరికి, ఆమెతో సన్నిహితంగా ఉన్న వ్యక్తిని నరికి చంపిన కేసులో తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరితోటకు చెందిన పితాని సత్యనారాయణకు సెక్షన్ 302 కింద జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా, సెక్షన్ 307 కింద 7 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 9వ అదనపు సెషన్ జడ్జి ఎం.మాధురి తీర్పు నిచ్చారు. సీఐ ఎ.వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. వేమగిరి తోటకు చెందిన పితాని సత్యనారాయణ తన భార్య భవానీ అదే గ్రామానికి చెందిన బొంతు వెంకన్నతో కలిసి ఉండడాన్ని చూసి వివాహేతర సంబంధం ఉందని భావించి ఇద్దరినీ కత్తితో నరికాడు. వెంకన్న అక్కడికక్కడే మరణించగా భవానీకి గాయమైంది. వెంకన్న సోదరుడి ఫిర్యాదుతో అప్పటి సీఐ కె.శ్రీధర్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా వాదోపవాదాల అనంతరం జడ్జి ఎం.మాధురి నిందితుడికి సెక్షన్ 302 కింద జీవితఖైదు, రూ.10 వేల జరిమానా, సెక్షన్ 307 కింద ఏడేళ్ల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 9 నెలలు జైలుశిక్ష విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ వీవీఎస్‌బీ రాజు వాదనలు వినిపించారు.

దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం చేసిన

ఫీల్డ్ అసిస్టెంట్‌కు 14 రోజుల రిమాండ్

కరప, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి కాకినాడ కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ 14రోజుల రిమాండ్ విధించినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడకు చెందిన దివ్యాంగురాలిపై అదే గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మట్టపర్తి వీరబాబు ఈనెల 11న రాత్రి అత్యాచారయత్నం చేసి పరారైన విషయం పాఠకులకు తెలిసిందే. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కరప పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఆదేశాలతో సబ్‌జైలుకు తరలించారు.

అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో

సత్తా చాటిన నాగబాబు

3 బంగారు పతకాలను సాధించిన కరప సబ్‌యూనిట్ మలేరియా అధికారి



3 బంగారు పతకాలు, సర్టిఫికెట్లతో నాగబాబు

కరప, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన 44వ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో కాకినాడ జిల్లా కరప సబ్‌యూనిట్ మలేరియా అధికారి యాతం నాగబాబు సత్తా చాటి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. గుడివాడ ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో ఈనెల 14నుంచి రెండు రోజుల పాటు పరుగు పందెం పోటీలు జరిగాయి. 200మీటర్లు, 400మీటర్లు, 800మీటర్లు పరుగుపందెంలో వరుసగా మొదటి స్థానాలు సాధించి బంగారు పతకాలను గెలుచుకున్నారు. ఈ క్రమంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు రాజస్థాన్‌లోని ఆళ్వార్ వద్ద జరిగే 44వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు నాగబాబు ఎంపికయ్యారు. 2013 నుంచి ఇప్పటివరకు జరిగిన వివిధ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్ పరుగుపందాల్లో పలు కేటగిరీల నుంచి 60 పతకాలను సాధించినట్టు మంగళవారం ఆయన విలేకరులకు తెలిపారు. అనంతరం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాదపూర్వకంగా కలిసి తాను సాధించిన బంగారు పతకాలను, సర్టిఫికెట్లను చూపించారు. నాగబాబును ఎమ్మెల్యే కొనియాడి అభినందనలుతెలిపారు.

ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు

'నన్నయ' విద్యార్థి వెంకటరమణ ఎంపిక



వెంకటరమణను అభినందిస్తున్న అధ్యాపకులు

దివాన్‌చెరువు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో వచ్చే నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాల ఆఖరి సంవత్సరం విద్యార్థి ఎస్.వెంకటరమణ ఎంపికైనట్టు వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రమణను వీసీ సన్మానించి వివరాలు తెలిపారు. నన్నయ వర్సిటీలో జరిగిన ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరంలో ఎంపికైన రమణ పదిరోజులు పూణేలో జరిగిన ప్రీఆర్‌డిలో చక్కటి ప్రతిభ కనబరచి గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఎంపికైనట్టు చెప్పారు. మన రాష్ట్రం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపిక కాగా వారిలో నన్నయ వర్సిటీ విద్యార్థి వెంకటరమణ ఉండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కార్యక్రమ కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం అధికారి ఎం.గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్ - 2 ఫార్మసిస్ట్ ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాల పరిధిలోని మెడికల్ అండ్ హెల్త్ జోన్ - 2 పరిధిలోని కాంట్రాక్టు గ్రేడ్ - 2 ఫార్మసిస్ట్ పోస్టులకు సంబంధించిన రివైజ్డ్ ప్రొవిజనల్ మెరిట్ లిస్టును మంగళవారం విడుదల చేశారు. ఈ మేరకు రీజనల్ డైరెక్టర్ పద్మా శశిధర్ ఒక ప్రకటన విడుదల చేశారు. లిస్టు జిల్లా ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో ఉంచడం జరిగిందని తెలిపారు. మెరిట్ లిస్టుకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు, ఫిర్యాదులను ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా తెలియజేయాలని సూచించారు.

ఏపీఎస్పీలో హోరాహోరీగా స్పోర్ట్స్‌మీట్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో గత 2రోజులుగా నిర్వహిస్తున్న యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మంగళవారం షార్ట్ పూట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, హైజంప్, 200 మీటర్స్, 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో రెట్టించిన ఉత్సాహంలో ఏపీఎస్పీ పోలీసులు పాల్గొన్నారు. 800 మీటర్ల పరుగు పందెం, 1500 మీటర్ల పరుగు పందెం (పురుషులు), క్రికెట్ పోటీలు, కబడ్డీ, టెన్నిస్ డబుల్స్ మహిళలు లెమన్ స్పూన్, టెన్నీకాయిట్ పోటీలు, త్రో బాలింగ్, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహించగా ఏపీఎస్పీ బెటాలియన్ పోలీసులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. బుధవారం మూడోరోజు ముగింపు క్రీడలు జరుగుతాయని పోలీసులు తెలిపారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న పోలీసులు



లెమన్ స్పూన్ పోటీలో పాల్గొన్న మహిళలు

ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోండి

కరప, డిసెంబరు 17: మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని ఎంపీడీవో మట్ట పర్తి అనుపమ సూచించారు. ఈనెల 17, 18న వేములవాడ సచివాలయంలో.. 19, 20న గొర్రిపూడి-2 సచివాలయంలో, 26, 28న కరప రెండు సచివాలయాల్లోను ఈ ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయని పేర్కొన్నారు.

రైతులకు అంకితభావంతో సేవలందించాలి

డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు నాయకులు అభినందనలు



గొల్లప్రోలు: చైర్మన్ ఊటా ఆదివిష్ణును అభినందిస్తున్న జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి

గొల్లప్రోలు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ప్రతినిధులు రైతులకు అంకితభావంతో సేవలందించాలని జనసేన పార్టీ పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సూచించారు. గొల్లప్రోలు ఏలేరు, పీబీసీ-1 డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లుగా ఎన్నికైన ఊటా ఆదివిష్ణు(నానిబాబు), మురాలశెట్టి సునీల్‌కుమార్‌లు, పలువురు నీటి సంఘాల అధ్యక్షులు మంగళవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంలో మర్రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని మర్రెడ్డి అభినందిస్తూ రైతుల వారిపై పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. సాగునీటికి ఎక్కడా ఇబ్బంది కలగకుండా అధికారులతో కలిసి పని చేయాలని చెప్పారు. పవన్ ఆశయాలకు అనుగుణంగా పని తీరు ఉండాలని, ఏ ఇబ్బంది ఉన్నా అధికారులు, తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పిఠాపురం: ఏలేరు, పీబీసీ ఆయకట్టులో ప్రతి ఎకరాలకు సాగునీరు అందేలా చూడటంతో పాటు రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. పిఠాపురం ఏలేరు, పీబీసీ-2 డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లుగా ఎన్నికైన సోము సత్యనారాయణ, అనిశెట్టి సత్యానందరెడ్డి, ఏలేరు-6. పీబీసీ-1 డీసీల వైస్‌చైర్మన్లుగా ఎన్నికైన ఎలుబండి గంగా వెంకటరమణ(బాబులు), కతారి రాజబాబు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వర్మను కలిశారు. తమకు అవకాశం కల్పించినందులకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఏలేరు' చైర్మన్‌గా రాజశేఖర్

పెద్దాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన వేదుళ్ల దొరయ్య రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్మన్‌గా తిరుపతి గ్రామానికి చెందిన మొయిళ్ల వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నీటిపారుదల శాఖ కార్యాలయం వద్ద ఈ ఎన్నిక నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతుల సాగు నీటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌కు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) తదితరులు శుభాకాంక్షలు తెలియచేశారు.

'తాళ్లరేవు' చైర్మన్‌గా భాస్కరరాజు

తాళ్లరేవు, డిశంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఇంజరం సాగునీటి సంఘం అధ్యక్షుడు వేగేశ్న భాస్కరరాజు ఎంపికయ్యారు. సుంకరపాలెం, తాళ్లరేవు, పి.మల్లవరం, ఇంజరం, కోరింగ, నీలపల్లి టీడీపీ నేతలు, కార్యకర్తలు భాస్కరరాజుకు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. టీడీపీ నేతలు మోపూరి వెంకటేశ్వరరావు, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ పాల్గొన్నారు.

'అనపర్తి' వైస్‌చైర్మన్‌గా కృష్ణమూర్తి

సామర్లకోట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనపర్తి డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్‌చైర్మన్‌గా సామర్లకోట మండలం జీ.మేడపాడు నీటి సంఘం చైర్మన్‌గా గెలుపొందిన గోలి కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కృష్ణమూర్తిని కాకినాడ పార్లమెంటరీ తెలుగురైతు కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, టీడీపీ నాయకులు తోటకూర శ్రీనివాసు, పాలకుర్తి బ్రహ్మాజీచౌదరి, గుమ్మళ్ళ రామకృష్ణ, పాలకుర్తి రవిబాబు, పాలకుర్తి చినబాబు, జనసేన నాయకులు జానా వెంకట్రావు, జానా శ్రీను పూలమాలలతో అభినందించారు.

'కరప' చైర్మన్‌గా సత్యనారాయణ

కరప, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కరప డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా వేములవాడ నీటి సంఘం అధ్యక్షుడు పుణ్యమంతుల గంగసత్యనారాయణ (పీజీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా కరప నీటిసంఘం అధ్యక్షుడు మెర్ల వీర వెంకటప్రభాకరచౌదరిని ఎన్నుకున్నారు. కాకినాడ ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయంలో కరప డీసీ ఎన్నిక జరిగింది. కరప డీసీ పరిధిలో కరప, వేములవాడ, పెనుగుదురు, గొర్రిపూడి, సంపర, అరట్లకట్ట నీటిసంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. డీసీ చైర్మన్‌గా పీజీ సత్యనారాయణ, వైస్‌చైర్మన్‌గా ప్రభాకరచౌదరిలను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఎన్నికల అధికారి బి.గోవిందు వారికి ఎన్నికల ధృవీకరణపత్రాన్ని అందజేశారు. అనంతరం సత్యనారాయణ ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నేతలు అభినందించారు. సిరిపురం డీసీ చైర్మన్‌గా పెనుమళ్ల నీటిసంఘం అధ్యక్షుడు పేపకాయల నారాయణరావు, వైస్‌చైర్మన్‌గా పెద్దాపురప్పాడు నీటిసంఘం అధ్యక్షుడు బిరుదా శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారికి ఎన్నికల అధికారి బి.గోవింద ధృవీకరణపత్రాలను అంద జేసి అభినందించారు.



కరప డీసీ చైర్మన్‌గా ఎన్నికైన సత్యనారాయణను అభినందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

మున్సిపల్ కమిషనర్లతో సమావేశం

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ బుధవారం కాకినాడ జిల్లాకు రానున్న నేపథ్యంలో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్‌తో మంగళవారం కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సమావేశమయ్యారు. మంత్రి పర్యటన నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఏడీసీ కెటి సుధాకర్, జిల్లాలోని మున్సిపాల్టీల కమిషనర్లు పాల్గొన్నారు.

నకారా విగ్రహానికి నివాళి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాయుడుపాలెంలో రిటైర్డు పోలీసు అధికారుల సంఘం కార్యాలయంలో పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. పెన్షనర్ల ఆశాజ్యోతిగా పేరొందిన ధరమ్ స్వరూప్ నకారా విగ్రహానికి ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.దీపిక పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పెన్షనర్లను ఘనంగా సత్కరించి, పండ్లు, బహుమతులు అందజేశారు.

వేట్లపాలెంలో అధికారుల విచారణ

సామర్లకోట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామ శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిసరాల్లో దళితకాలనీలు పోలీసు బందోబస్తుల మధ్య బిక్కు బిక్కుమంటున్నాయి. ఆదివారం రాత్రి ఒకే సామాజిక వర్గాలకు చెంది ఒక కుటుంబంపై మరొక కుటుంబంలోని వ్యక్తులు కత్తులు, రాడ్‌లతో దాడులు, నరికివేతల ఘటనలో ముగ్గురు వ్యక్తులు మృతిచెందడమే గాక మరో ఏడుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. వివాదానికి ప్రధాన కారణమైన దళిత చెరువు స్థలంలో డూప్లెక్స్ ఇంటి నిర్మాణంపై రెవెన్యూ అధికారులు తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో వీఆర్వోలు, తదితర రెవెన్యూ అధికారులు మంగళవారం సాయంత్రం వరకూ దళిత చెరువు వద్ద పలువురిని విచారించి సమాచారాన్ని సేకరించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వ సహకారం ప్రశ్నార్థకంగా మారింది.

గంజాయి రవాణా, వినియోగంపై నిఘా

గొల్లప్రోలులో ఎస్పీ తనిఖీలు



గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్

గొల్లప్రోలు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా, వినియోగంపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి ఆరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశించారు. గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో ఆయన మంగళవారం సాయంత్రం వార్షిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌రికార్డులు, కేసుల పురోగతి, పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అయామ్ సైబర్ అవేర్ కార్యక్రమం ద్వా రా అన్ని గ్రామాలు, విద్యాసంస్థలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. డిజిటల్ అరెస్ట్ అనేది లేదని, అటువంటి అరెస్టు గురించి ఎవరైనా బెదిరిస్తే తక్షణం సమీపంలోని పోలీసుస్టేషన్‌లో సమాచారం అందిం చాలని కోరారు. మహిళా రక్షక్ కార్యక్రమాన్ని నిర్వహించి మహిళా చట్టాలు, మహిళలు స్వీయభద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బ్యాడ్‌గుడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయరహదారులపై ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టినట్టు ఎస్పీ తెలిపారు. బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించి స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించామని చెప్పారు. పోలీసుస్టేషన్‌కు వచ్చేవారి పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. తనిఖీల్లో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన బాధితులకు అండ

సిటీ ఎమ్మెల్యే కొండబాబు పలుచోట్ల రెవెన్యూ సదస్సులు



కాకినాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వే అవకతవకల వల్ల భూములు కోల్పోయిన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. మీ భూమి- మీ హక్కు నినాదంతో కాకినాడ అర్బన్ పరిధిలోని 36-ఏ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. రెవెన్యూ రికార్డులు ప్రజలకు అందుబాటులో ఉంటాయని, ఏమైనా అవకతవకలు గుర్తిస్తే వెంటనే సరి చేస్తామన్నారు. రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చసుకోవాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర మాట్లాడుతూ భూ యజమానులు తమ దస్తావేజులు తెచ్చుకుని భూ రికార్డులతో పరిశీలించుకోవచ్చన్నారు. అర్బన్ పరిధిలోని మేడలైన్ ప్రాంతంలో తమ భూముల సర్వే నంబర్లు రికార్డుల్లో మారి పోయాయని కొందరు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, 36వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ తులసి, టీడీపీ జిల్లా నాయకులు గదుల సాయిబాబు, ఎంఏ తాజుద్దీన్, సీకోటి అప్పలకొండ, బచ్చు శేఖర్, అద్దేపల్లి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: గ్రామాల్లో భూసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నందున భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. మండలంలో పవర పంచాయతీ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ సదస్సు డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. 7 అర్జీలను స్వీకరించారు. కార్యాలయ సూపరింటెండెంట్ కె.పద్మజ, పీఏసీఎస్ సీఈవో వీరంరెడ్డి కామేశ్వరరావు, ఆకునూరి సత్తిబాబు, వీఆర్వోలు చంద్రబాబు, అప్పారావు, నాగేశ్వరరావు, ఫాజల్ అబ్బాస్, సుబ్బారావు, సర్వేయరు సీతారామాచార్యులు, గ్రామ సర్వేయరు ముసలయ్య, దయాకిరణ్, పెంకే వెంకటేష్, డీఈవో శ్రీహరి తదితర రైతులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని డిప్యూటీ తహశీల్దార్ కల్యాణ చక్రవర్తి అన్నారు. పండూరులో రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి అనంత లక్ష్మీత్రిమూర్తులు, గ్రామ కార్యదర్శి రామోహ్మన్ చౌదరి, రీసర్వే డీటీ సురేష్, వీఆర్వోలు కిరణ్, చిన్న, నాయకులు నందిపాటి రమణ ఉన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

పాదగయలో జాయింట్ కమిషనరు విచారణ



విచారణ నిర్వహిస్తున్న జాయింట్ కమిషనరు సుబ్బారావు, డిప్యూటీ కమిషనరు రమేష్‌బాబు

పిఠాపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల సిబ్బంది, అధికారులు ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా, భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు సుబ్బారావు హెచ్చరించారు. పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో పులిహోర ప్రసాదంలో పురుగులు వచ్చినట్లు అందిన ఫిర్యాదులపై దేవదాయశాఖ కమిషనరు విచారణకు ఆదేశించడంతో డిప్యూటీ కమిషనరు డీవీఎల్ రమేష్‌బాబుతో కలిసి ఆయన మంగళవారం పాదగయకు వచ్చి విచారణ చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సుదీర్ఘంగా విచారణ జరిపారు. ప్రసాదం తీసుకున్న వ్యక్తితో పాటు విశ్వహిందూపరిషత్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు నుంచి వివరాలు సేకరించారు. వారు జరిగిన సంఘటన వివరాలను ఆర్‌జేసీకి తెలియజేశారు. అనంతరం సిబ్బందిని విచారించారు. పులిహోర ప్రసాదంలో వినియోగించిన సరుకుల నాణ్యతపై పరిశీలన చేస్తామని తెలిపారు. పాదగయ క్షేత్రంలో ఇటువంటి సంఘటనలు తరచూ జరగడం దురదృష్టకరమని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఏమి చర్యలు తీసుకోవాలో కమిషనర్‌కు నివేదిస్తామని తెలిపారు. పాడైన సరుకులు వినియోగిస్తున్నట్టు వచ్చిన ఆరోపణలపై పరిశీలన చేసి సీసీ ఫుటేజీ సేకరిస్తామని చెప్పారు. ఈవో, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. భక్తుల పట్ల అమర్యాదకరంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, అలా ప్రవర్తించే సిబ్బందిని గుర్తించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. టెండర్ ద్వారా సేకరించే సరుకుల నాణ్యతను నిరంతరం పరీక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బందిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారిపై కొందరు ఫిర్యాదులు చేశారని, వాటిపై పరిశీలన జరుపుతున్నామని తెలిపారు. విచారణలో పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పెన్షనర్స్ డే

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ కాకినాడ బ్రాంచీలో పెన్షనర్స్ డే నిర్వహించారు. ఎంఎఎస్‌వివిఎస్ మూర్తి, ఏజీఎం హాజరయ్యారు. క్యాన్సర్ పేషెంట్స్, డయాలసిస్ పేషెంట్స్‌కి రూ.3వేలు ఆర్థిక సాయం చేశారు.

గ్రామపంచాయతీల సుస్థిరాభివృద్ధికి కృషిచేయాలి



కరప: మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

కరప, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సూచించారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో మంగళవారం సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలకు ఏర్పాటుచేసిన రెండురోజుల శిక్షణా తరగతులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కోర్స్ డైరెక్టర్, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ఆర్థిక, సామాజిక, పర్యావరణ అంశాల అభివృద్ధి సాధించడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని సూచించారు. ఎంపీహెచ్‌ఓ వైఎస్ రత్నకుమారి మాట్లాడుతూ బాలికల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈవోపీఆర్డీ సలాది వెంకటశ్రీనివాసరావు మాట్లాడుతూ 9రకాల థీమ్స్ ద్వారా గ్రామాలను అభివృద్ధి పరుచుకునేందుకు శిక్షణాతరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు. బుధవారంతో శిక్షణాతరగుతు ముగుస్తాయని అధికారులు వెల్లడించారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

కొత్తపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో రవికుమార్ విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామసర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటుచేసిన జీడీడీపీ రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేంద్రప్రభుత్వం సూచించిన 15 సూత్రాలను గ్రామాల అభివృద్ధికి అమలు చేసేందుకు కృషి చేస్తామని శిక్షణలో పాల్గొన్న మండల స్థాయి అధికారులు, పాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హామీ ఇచ్చారు. తొలుత జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగనిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ సత్యా రెడ్డి, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

సర్పవరంజంక్షన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధికి అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునేలా లక్ష్యాలు నిర్దేశించుకోవాలని ఎంపీడీవో పసుపులేటి సతీష్ కోరారు. మంగళవారం రమణయ్యపేట మండల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ (ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్)ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన సహజ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళికలు తయారుచేసి, అమలు చేయాలని కోరారు. సుపరిపాలనతో గ్రామపంచాయతీ అనే అంశంపై రీసోర్సుపర్సన్లు పిడుగు పాండురంగారావు, బి.గోవిందరాజులు వివరించారు.

ప్రొటోకాల్‌పై నిలదీసిన సర్పంచ్‌లు:

శిక్షణా కార్యక్రమానికి ముందు సర్పంచ్‌లకు ప్రొటోకాల్ అమలుపై వివాదం రేగింది. అధికారులు తమకు కనీస సమాచారం తెలపకుండా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం ఎంత వరకు సమంజసమని తిమ్మాపురం, నేమాం గ్రామాల సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రాందేవు సూర్యప్రకాశరావు ప్రశ్నించారు. తీర్మానాలకు సర్పంచ్‌లు కావాలని, అభివృద్ధి కార్యక్రమాల్లో తమ భాగస్వామ్యం లేకుండానే పనులు చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో సతీష్ హామీ ఇవ్వడంతో సర్పంచ్‌లు శాంతించారు.

మోటార్, లారీ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం

కాకినాడ సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ మోటార్ లారీ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానికంగా గల యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో అతిథులుగా టీడీపీ నగర కమిటీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు, లారీ ఓనర్స్ అసోసియేషన్ కాకినాడ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, కార్యదర్శి అల్లం రాజు విచ్చేశారు. ఈసందర్భంగా మోటార్ లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఎలిపే శ్రీనివాసు, కార్యదర్శిగా మట్ట వెంకట తిరుపతిరెడ్డి, కోశాధికారిగా పైల వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా పెదిరెడ్ల నానాజీ, లకమాని వీర మణికంఠ, డొక్కాడ నాని, సంయుక్త కార్యదర్శులుగా ఎజ్జర్ల భవాని శంకర్, కపిల్, కార్యనిర్వాహక కార్యదర్శిగా విర రాంకుమార్, గౌరవ అధ్యక్షుడిగా మట్టా సూరిబాబు, గౌరవ సలహాదారుగా యార్లగడ్డ సూర్యచంద్రరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ లారీ మోటార్ వర్కర్స్ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తానని, డ్రైవర్లు క్లీనర్లకు ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే తీర్చేవిధంగా పనిచేస్తానన్నారు. అనంతరం నూతన కమిటీని సత్కరించారు.

రామాలయ నిర్మాణానికి మోదీతో శంకుస్థాపన



ధనుర్బాణాలకు పూజలు నిర్వహిస్తున్న ఉత్తరాధి మఠాధిపతి సింహాచార్ తదితరులు

కాకినాడ సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అయోధ్య శరయు నది తీరంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో రూ.150కోట్లతో రామాలయాన్ని నిర్మిస్తున్నామని, ప్రధాని మోదీ ఆలయ నిర్మాణ శంకుస్థాపన చేస్తారని అయోధ్య వాసి, ఆలయ నిర్మాణ పర్యవేక్షకుడు చల్లా శ్రీనివాసశాస్త్రి తెలిపారు. శ్రీబ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక గైగోలుపాడు సాయిబాబా ధ్యాన మందిరం కమిటీ సహకారంతో అయోధ్య రాముల వారికి సమర్పించనున్న రజిత, స్వర్ణ ధనుర్బాణాలను మంగళవారం భక్తుల సందర్శనార్థం ఉంచారు. ఈసందర్భంగా రాజమహేంద్రవరం ఉత్తరాధి మఠాధిపతి విజయ్ సింహాచార్ దంపతులు ధనుర్బాణాలకు ప్రత్యేక పూజలు జరిపారు. చల్లా శాస్త్రి మాట్లాడుతూ అయోధ్య బాల మందిర నిర్మాణంలో కమిటీ విజ్ఞప్తి మేరకు ఐదు వెండి ఇటుకలను కానుకగా అందించగా, వాటినే శంకుస్థాపన కార్యక్రమంలో వినియోగించారని తెలిపారు. ఈసందర్భంగా మఠాధిపతి విజయ్ సింహాచార్ దంపతులను సత్కరించారు. ధ్యాన మందిర కమిటీ అధ్యక్షుడు మేక లక్ష్మణరావు, సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పసుమర్తి సత్యనారాయణ మూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షుడు యాతగిరి పరశురామ్, మధ్వసభ కమిటీ కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు పాల్గొన్నారు.

షర్మిల నేతృత్వంలో ప్రజలకు న్యాయం

కాంగ్రెస్ నేతలు మల్లిపూడి రాంబాబు, చెక్కా నూకరాజు

కాకినాడ సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నాడు వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు న్యాయం జరిగిందని, ఆయన తనయ షర్మిలమ్మ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే మళ్లీ ప్రజలకు న్యాయం జరుగుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, గోవింద్, కృష్ణ పాల్గొన్నారు.

దుప్పట్లు, రగ్గులు పంపిణీ

పిఠాపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని రహదారుల వెంబడి, రైల్వేస్టేషన్, బస్‌షెల్టర్లు, దేవాలయాల వద్ద, డివైడర్లపై నిద్రిస్తున్న వారిని పీసేవ సభ్యులు సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకూ గుర్తించి వారికి 100కిపైగా రగ్గులు, దుప్పట్లు అందజేశారు. ఎవరు ఆపదలో ఉన్నా తాము అండగా ఉంటామనే సందేశాన్ని ఇచ్చే ఉద్దేశ్యంతో ఈకార్యక్రమాన్ని చేపట్టినట్లు పీసేవ వ్యవస్థాపక అధ్యక్షుడు చామంతి నాగేశ్వరరావు తెలిపారు. పీసేవ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందు బాబూరావు, ఏడిద రాజేష్, గౌరవాధ్యక్షుడు గంటా ప్రసాద్, సభ్యులు ఫణీంద్రరావు, భాషా, కొండలరావు, ప్రసాద్, అరిగెల వాసు, దొర, మురళీకృష్ణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

స్టడీమెటీరియల్ పంపిణీ

కాకినాడ సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక జగన్నాథపురం చర్చిస్క్వేర్ సెంటర్‌లోని బచ్చు రామం మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అగ్నికుల క్షత్రియ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్, బుక్స్ పంపిణీ చేశారు. మంగళవారం కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు అద్దంకి వెంకన్నబాబు అధ్యక్షత వహించగా వ్యాపారవేత్త సంగాని ఈశ్వరరావు ప్రసంగించారు. సంఘం వ్యవస్థాపకుడు చింతా నారాయణ మూర్తిరాజు, పెసంగి రాములు, చింతా రామకృష్ణ, ఎస్.కృష్ణంరాజు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ఎన్ బేబి సరోజినీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అపరిచితుల ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

పిఠాపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) అపరిచితులు నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం ఎస్ఐ మణికుమార్ సూచించారు. పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో మంగళవారం రాత్రి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బహుమతులు వచ్చాయని, కస్టమ్స్‌లో మీ వస్తువులు ఉన్నాయని చెప్పినా, ఆర్డర్ చేయకున్నా ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా మీకు వస్తువులు వచ్చాయని చెప్పినా స్పందించవద్దని కోరారు. అటువంటి వాటి గురించి పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

20న ఉచిత వైద్య శిబిరం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా ఆధ్వర్యంలో ఈనెల20న గైగోలుపాడులో మహాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా మహిళలకు రొమ్ము, గర్భాశయ, దంత, కంటి, గైనికాలజీ, సాధారణ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా తెలిపారు.

'యానిమేటర్ అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి'



మహిళా సభ్యులతో విచారణ నిర్వహిస్తున్న డీపీవో జిలాని

సర్పవరం జంక్షన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ పి.వెంకటాపురం యానిమేటర్ వల్లు కనకమహాలక్ష్మి అక్రమాలపై సమగ్ర విచారణ నిర్వహించాలని ఆ గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. మహిళా సంఘాలకు చెందిన బ్యాంకు లోన్లు, రికవరీ, నగదు చెల్లింపుల్లో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిట్లు మహిళా సంఘాల ప్రతినిధులు డీఆర్‌డీఏ పీడీ, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డీఆర్‌డీఏ డీపీఎం జిలాని ఆధ్వర్యంలో మంగళవారం పి.వెంకటాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద విచారణ చేపట్టారు. మహిళా శక్తి సంఘాల సభ్యుల నుంచి యానిమేటర్‌పై చేసిన ఆరోపణలకు చెందిన అంశాలపై వివరాలను డీపీఎం జిలాని స్వీకరించారు. బ్యాంకు పాస్ పుస్తకాలు, నగదు డిపాజిట్ రసీదులు, తీర్మానాల పుస్తకాలు, లోన్ సొమ్ము పూర్తిస్థాయిలో ఇవ్వకుండా, సొంతానికి యానిమేటర్ వాడుకున్నట్లు సభ్యులు తన దృష్టికి తీసుకురావడం జరిగినట్లు డీపీఎం జిలాని తెలిపారు. విచారణ జరుగుతుందని, నివేదిక డీఆర్‌డీఏ పీడీకి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీసీ ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామకంఠాల్లో ఆక్రమణలను తొలగించాలి



కోరింగలో మాట్లాడుతున్న డైరెక్టర్ లక్ష్మణరావు

తాళ్లరేవు, డిశంబరు 17(ఆంధ్రజ్యోతి): కోరింగ పంచాయతీ పరిధి గుడ్డువానితూము సెంటరు పిడబ్ల్యుడీకాలువను ఆనుకొని పోరంబోకు గ్రామ కంఠాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించి, మురుగునీరు కిందకుపోయేలా అధికారులు చర్యలు తీసుకోవాలని శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. మంగళవారం కోరింగ పంచాయతీలో తహశీల్దార్ పి.త్రినాథరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈసందర్భంగా టేకుమూడి లక్ష్మణరావు మాట్లాడుతూ డ్రైనేజీలు, కాలువలను ఆక్రమించి పక్కానిర్మాణాలు చేశారన్నారు. సర్పంచ్ పెయ్యల మంగేష్ మాట్లాడుతూ ఎక్స్‌కవేటర్‌తో తవ్వించిన డ్రైనేజీలను కూడాపూడ్చేసి ఆక్రమణలు చేస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిటీ సూరిబాబు, ఎంపీటీసీ రత్నకుమారి, కార్యదర్శి విజెవి రమణ, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కంచి మహాసంస్థానంలో విశేష పూజలు

సామర్లకోట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కంచిమహాసంస్థానం సామర్లకోట ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం వద్ద ధనుర్మాసం పురస్కరించుకుని మంగళవారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి ఆధ్వర్యంలో పండితులు చక్రవర్తుల కుటుంబీకులతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మహిళా భక్త కమిటీ నేతృత్వంలో విష్ణుసహస్ర నామ పారాయణ, లలితా సహస్ర నామపారాయణ, హనుమాన్ చాలీసా పారాయణ పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో అంజనేయ స్వామికి, గణపతికి, స్వయంవరపార్వతి అమ్మవార్లకు విశేష పుష్పార్చన పూజలు నిర్వ హించారు. సామర్లకోట, పెద్దాపురం పరిసర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ధనుర్మాసం సందర్భంగా ప్రతీ మంగళవారం సాయంత్రం లలితా సహస్ర నామపారాయణ, విష్ణుసహస్ర నామపారా యణ, హనుమాన్ చాలీసా పారాయణ, పూజలు నిర్వహిస్తామని, భక్తులు పూజల్లో పాల్గొనవచ్చని నిర్వాహకులు పతంజలి తెలిపారు.

ఉండూరులో ట్రాఫిక్ స్తంభన



సామర్లకోట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉండూరు మీదుగా గొంచాల, అచ్చంపేటలకు వెళ్లే ప్రధానరోడ్డులో మంగళవారం రాత్రి ట్రాఫిక్ స్తంభించింది. సూరంపాలెం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సులకు ఉండూరు పొలాల నుంచి ధాన్యం లోడుతో వెళుతున్న ట్రాక్టర్ పరస్పరం ఎదురెదురుగా నిలిచిపోవడంతో ఇటు ఉండూరు రైల్వే గేటు వరకు, అటు గొంచాల వరకు వందలాది వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. ద్విచక్రవాహనం వెళ్లే వీలు లేని పరిస్థితులు నెలకొనడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రెండు గంటలు పైబడి ట్రాఫిక్ స్తంభించినా ట్రాఫిక్ పోలీసులు పత్తాలేకుండా పోయ్యారు. రెండు గంటల అనంతరం వాహనాలను పక్కకు తప్పించి మార్గం సుగమం చేసారు. నిత్యం సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడంతో వాహనదారులు పోలీసుల వైఖరిని విమర్శిస్తున్నారు.

తుని డిగ్రీ కళాశాలలో నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

తుని రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ లలిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆమె కోరారు. కళాశాలలో కెమిస్ట్రీ బోధించుటకు గెస్ట్ లెక్చరర్లకు గురువారం ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల వారు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆమె కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



మారేడుమిల్లి-చింతలపూడి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రూ.30 కోట్లతో రహదారుల నిర్మాణానికి శ్రీకారం

రంపచోడవరం/మారేడుమిల్లి/అడ్డతీగల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం నియోజకవర్గంలోని ఏడు రోడ్ల పనులకు తొలి విడతగా రూ.30 కోట్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి తెలిపారు. మంగళవారం ఆమె మారేడుమిల్లి-చింతలపూడి, ఆకూరు-బడిగుంట, అడ్డతీగల-అనంగిరి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, తెలుగుదేశం పార్టీ నాయకులు కారం సురేష్‌బాబు, పి.అనంతమోహన్, గురుకు శేషకుమార్, పొడియం శ్రీనుబాబు, బీశెట్టి అప్పాజీ, కర్రి సన్యాసిరెడ్డి, దూడ సువర్ణకుమార్, టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి, జనసేన నాయకులు మల్లా దుర్గాప్రసాద్, బీశెట్టి సత్య, కళ్యాణ్, కె.రవి, బీజేపీ నాయకులు భారతి, బుల్లికొండలుదొర, రేవల రామకృష్ణారెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

'అంతర్ జిల్లా డిప్యుటేషన్లు నిలుపుదల చేయాలి'

రంపచోడవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి సీఆర్టీలను ఉపాధ్యాయులుగా నియమించాలని మంగళవారం ఏటీఏ ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉపాధ్యాయుల్లో చాలా మంది దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు ఉన్నారని, వారిని డిప్యూటేషన్‌పై దూర ప్రాంతాలకు బదిలీ చేయడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అంతర్ జిల్లాల డిప్యూటేషన్లు నిలుపుదల చేయాలని కోరారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలని ఏటీఏ ఉపాధ్యాయ సంఘం నాయకుడు అనిల్ కోరారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సీఆర్టీలను అనంతపురం, గుంటూరు తదితర సుదూర జిల్లాలకు డిప్యుటేషన్‌పై పంపించారని, వెంటనే వాటిని నిలిపివేయాలన్నారు.



కూనవరం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో నాగలక్ష్మి

'బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలి'

కూనవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు ఆధునిక టెక్నాలజీతో ప్రపంచం దూసుకెళ్తున్నా బాల్య వివాహాలను మాత్రం అరికట్టలేకపోతున్నారని కూనవరం మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న ఆర్కూర్ సర్పంచ్ అభిరామ్ మాట్లాడుతూ ఏజెన్సీలో బాల్య వివాహాలు జరుగుతున్నాయని, దీనివల్ల బాలికలు చిన్నతనంలోనే గర్భందాలుస్తున్నారన్నారు. బాల్య వివాహాల నిరోధానికి గిరిజన గ్రామాల్లో చైతన్య సభలు నిర్వహించాలన్నారు. జడ్పీటీసీ గుజ్జా విజయ మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలలు సక్రమంగా కొనసాగట్లేదని, గుడ్లు పంపిణీ సరైన పద్ధతిలో జరగట్లేదన్నారు. ఆయాలు వెళ్లి పిల్లలను తీసుకురావాల్సి ఉండగా, తల్లులనే తీసుకురావాలని చెప్తున్నారన్నారు. ఏపీఆర్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక తల్లిదండ్రులు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాబోయే కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఐసీడీఎస్ పీవో నాగలక్ష్మి పలు సూచనలు చేశారు. ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన సమావేశంలో ఎంపీడీవో కేఆర్ విజయ, తహసీల్దారు శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సుకుమామిడిలో వైద్య శిబిరం

మోతుగూడెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం కొత్తపల్లి పంచాయతీ సుకుమామిడిలో మోతుగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రజ్ఞ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ గ్రామంలో 1 నుంచి 5 సంవత్సరాల వయసు పిల్లలకు గత రెండు రోజులుగా వాంతులు, విరేచనాలు ఏకధాటిగా అవడంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. పెద్దవాగు నీళ్లు కాచుకుని తాగడంతో ఈ విధంగా జరుగుతోందని తల్లిదండ్రులు చెప్పడంతో ఈ నీటిని టెస్టింగ్‌కు పంపించారు. గ్రామస్తులు, పిల్లలకు, ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు వైద్యం చేశారు.



విద్యార్థినులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రజ్ఞ

'రోడ్లు వేసి గిరిజనులకు మోక్షం కల్పించాలి'

వై.రామవరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రోడ్ల కోసం ఆదివాసీ సంఘం చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆదివాసీ చైతన్య వేదిక, సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి మాట్లాడుతూ రోడ్లు వేసి గిరిజనులకు మోక్షం కల్పించాలన్నారు. ఫారెస్టు క్లియరెన్స్ ఇవ్వకపోవడంతోనే మారుమూల ప్రాంతాలైన గుర్తేడు, చింతలపూడి తదితర లోతట్టు గ్రామాలకు రోడ్లు లేవన్నారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు పూడిగి లక్ష్మణరావు, నాయకులు గుడ్ల త్రిమూర్తులు, ముర్ల సూరిబాబు, నడిగొంట వెంకటేశ్వర్లు, బత్తుల శారద తదితరులు పాల్గొన్నారు.



రెండో రోజు దీక్షా శిబిరంలో ఆదివాసీ చైతన్య వేదిక, సంక్షేమ సంఘం నాయకులు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు





జగ్గంపేటలో భాస్కరరావు, దొరబాబులను అభినందిస్తున్న జ్యోతుల నవీన్, ఎన్నికైన వారిని అభినందిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రశాంతంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు

జగ్గంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలోని ఏలేరు ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఏలేరు ప్రాజెక్టు నీటి పంపిణీ సంఘం, వినియోగదారుల సంఘాల అధ్యక్షుల ఎన్నిక నిర్వహించారు. జగ్గంపేట డీసీ చైర్మన్‌గా నీలం శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా కంటే రామారావు (బుల్లబ్బులు), కిర్లంపూడి డీసీ చైర్మన్‌గా బస్వా వీరబాబు, వైస్ చైర్మన్‌గా శరకణం వీర వెంకటరమణ ఎన్నికయ్యారు. వారిని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, చదరం చంటిబాబు, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి), బస్వా వీరబాబు, వీరంరెడ్డి కాశిబాబు, భూపాలపట్నం ప్రసాద్, కంచుమర్తి రాఘవ, గ్రంథం ఈశ్వరరావు, జ్యోతుల రాంబాబు, బొదిరెడ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట శ్రీరామ్‌నగర్‌లోని పోలవరం ఎడమ ప్రధాన కాలువ డివిజన్ నెం.3 కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయంలో తోట వెంకటాచలం పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పరిధిలో డీసీ ఎన్నికను ఈఈ ఏపీ రాజేశ్వరరావు, ఏఈఈ నవీన్ ఉల్‌హన్ నిర్వహించారు. పుష్కర ఎత్తిపోతల పథకం నీటి సంఘాల అధ్యక్షులు ఎన్నికల్లో పాల్గొన్నారు. జగ్గంపేట డీసీ చైర్మన్‌గా అడబాల భాస్కరరావు, వైస్ చైర్మన్‌గా యల్లపు దొరబాబు, పెద్దాపురం డీసీ చైర్మన్‌గా పాలకుర్తి లక్ష్మీపతిరావు, వైస్ చైర్మన్‌గా కుకూరి సత్యనారాయణ, ప్రత్తిపాడు డీసీ చైర్మన్‌గా కాకిలేటి వీర్రాజు (బాబ్జీ), వైస్ చైర్మన్‌గా కోలా గంగాధర్, తుని డీసీ చైర్మన్‌గా కుర్ర వెంకటరమణ, వైస్ చైర్మన్‌గా వెలనాటి గంగాధర్ ఎన్నికయ్యారు. వారికి ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందించారు. టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఎన్నికల తీరును పరిశీలించారు. విజేతలకు ఆయనతో పాటు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, జీను మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, పైడిపాల సూరిబాబు, కందుల బాబ్జీ, రేఖ బుల్లిరాజు, యర్రంశెట్టి బాబ్జీ, బుర్రి సత్తిబాబు, ముసిరెడ్డి నాగేశ్వరరావు, తమటం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం గ్రామం నుంచి ముక్కొల్లు సర్పంచ్ జ్యోతుల రాంబాబు, భూపాలపట్నం ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ భారీ కాన్వాయ్‌తో పెద్దాపురం చేరుకున్నారు. ఆరు డీసీలకు వివిధ రూపాల్లో ఎన్నికలు నిర్వహించారు. ముక్కొల్లు గ్రామానికి చెందిన బస్వా వీరబాబు, గోనేడ గ్రామానికి చెందిన నీలం శ్రీను డీసీలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 21న ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, గంధం ఈశ్వరరావు, గొడే దొరబాబు, కంటా శ్రీను, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చదరం చంటిబాబు, తూము శ్రీరామచంద్రమూర్తి, గణేశ్వరరావు, కంచుమర్తి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

తుని రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు వీధిలోని పెన్షనర్ల సంఘ భవనంలో అధ్యక్షుడు పి.మాధవరావు అధ్యక్షతన పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. తుని ట్రెజరీ అధికారి కె.బాలచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశిష్ట సేవలు అందించిన 15 మంది పెన్షనర్లను సన్మానించారు. గౌరవ సలహాదారుడు సీతారామ రాజశ్రీ, త్రిమూర్తులు, కృష్ణ, డేనియల్ జోసెఫ్, పప్పులకొండ, ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తునిలో పెన్షనర్లను సత్కరిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్షనర్ల సంఘ భవనంలో ఎండీ ఇబ్రహీంఖాన్ నేతృత్వంలో పెన్షనర్ల పితామహుడు డీఎస్ నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ పెన్షనర్లు ఉద్దగిరి సోమరాజు, అనపర్తి సూర్యనారాయణ (భాను), సలీమ్‌ఖాన్, వాసా పుల్లయ్య, ఉడతా రామచంద్రరావు, సురేష్, షేక్ యాకూబ్‌లకు శాలువాలు కప్పి సత్కరించారు. చన్నాప్రగడ గాంధీ, ఏబీవీడీ ప్రసాద్, పొన్నాడ జోగిరాజు, కోరాడ అప్పలస్వామి, కృష్ణ, సీహెచ్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సబ్ ట్రెజరీ పరిధిలోని పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని సంఘ నాయకులు ముక్కు సుబ్రహ్మణ్యం, శేషగిరిరావు, సుబ్రహ్మణ్యం, జంధ్య సుబ్బారావు, వి.రామం కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, ఎంపీడీవో కుమార్‌బాబు, సబ్ ట్రెజరీ అధికారి ఖాన్‌లతో పెన్షనర్ల అసోసియేషన్ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజాను కలిసి తమ సమస్యలను వివరించి శాలువా కప్పి సన్మానించారు.

'సుస్థిర ప్రణాళికలతో గ్రామాల్లో అభివృద్ధి'

ప్రత్తిపాడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి ప్రణాళికలతో గ్రామాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రెండు రోజులు జరిగే శిక్షణ తరగతులను ఎంపీపీ ప్రారంభించారు. ఎంపీడీవో కుమార్‌బాబు, తహసీల్దారు ఎం.సూర్యప్రభ, ఈవోపీఆర్డీ కాశీవిశ్వనాథ్, ఏపీఎం వెంకట్, ఏపీవో కుమార్‌స్వామి, ఎంఈవో-2 అచ్చిరాజు 17లక్ష్యాలకు సంబంధించి చేపట్టాల్సిన పద్ధతులను వివరించారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఏఎన్ఎంలు, పశుసంవర్థక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో శిక్షణకు హాజరైన వారినుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ సుధాకర్

శంఖవరం (ఆంధ్రజ్యోతి): స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ అన్నారు. మంగళవారం ఆయన అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులను సామర్లకోట ఈటీసీ ప్రిన్సిపాల్ ప్రారంభించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి ఎంపీపీ పర్వత రాజబాబు నివాళులర్పించారు. అధికారులు, పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సూర్యనారాయణ అధ్యక్షతన సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. తొలుత మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.



తొండంగిలో సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివ్య

గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే దివ్య

తొండంగి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతులు కల్పించడం ద్వారా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తుని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. తొండంగిలో ఉపాధి హామీ నిధులతో నూతనంగా సిమెంటు రోడ్డును మంగళవారం ఆమె ప్రారంభించారు. అంతకుముందు కృష్ణాపురం, శృంగవృక్షం గ్రామల్లో జరిగిన రెవెన్యూ సదస్సులకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరంచారు. తహసీల్దారు మురార్జీ ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, మాకినీడి గాంధీ, మండల శాఖ అధ్యక్షుడు చొక్కా అప్పారావు, యువత అధ్యక్షుడు బంటుపల్లి అన్వేష్, సర్పంచ్‌లు కందా శ్రీధర్, సోమాల ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు కొయ్యా రామకేశవ, కొయ్యా శ్రీను, నేతలు కోడ రమణ, దూలం మురళి, భైరావఝుల చందు, వెన్నా మురళి, నేమాల కృష్ణ పాల్గొన్నారు.

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపురంలో తహసీల్దారు ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టీడీపీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), మోతుకూరి వెంకటేష్, కాపారపు అబ్బులు, పోల్నాటి కృష్ణ, ఎడ్ల అప్పలరాజు, అత్తి అచ్యుతారావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇర్రిపాకలో నారాయణ యాగం

జగ్గంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇర్రిపాక ఏలేరు నదీ తీరాన వేంచేసియున్న భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద ధనుర్మాసం సందర్భంగా నారాయణ యాగం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ-మణి దంపతులు కర్తలుగా పాల్గొని యాగ క్రతువును జరిపించారు. పలువురు ప్రముఖులు యాగాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ దంపతులు

'కొండపై శిలువను తొలగించాలి'

రౌతులపూడి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిడజాం గ్రామంలో కొండను కొల్లగొట్టి ప్రతిష్ఠించిన శిలువను తొలగించాలని బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. లేని పక్షంలో హిందూ దేవతల విగ్రహాలను పెట్టి పూజలు చేస్తామని హెచ్చరించారు ఆయన వెంట మానివెల్లి వెంకటరమణ, లవుడు శ్రీను ఉన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న అధికారులు

ఓగిపాలెంలో రెవెన్యూ సదస్సు

రాజవొమ్మంగి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజు కోరారు. మండలంలోని ఓగిపాలెంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. తహసీల్దారు అల్లు సత్యనారాయణతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ బి.సుబ్బలక్ష్మి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న ఐలాజ్ నాయకులు

జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులకు 'ఐలాజ్' అండ

ఏలేశ్వరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమ కార్మికుల ఆందోళన మంగళవారం 32వ రోజుకు చేరుకుంది. వారికి ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగతా శివ, జిల్లా కమిటీ సభ్యుడు ఆకాశపు నాగమల్లేశ్వరరావు మద్దతు తెలిపారు. శివ మాట్లాడుతూ యాజమాన్యం 409 మంది కార్మికులకు న్యాయం చేకూర్చాలన్నారు. భవిష్యత్తులో చేపట్టే ఆందోళనలకు తమ మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుందన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం

జగ్గంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ నిర్వహించారు. సుమారు 500 మందికి ఆయన స్వయంగా భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో సూరంపాలెం బాలు, ఉలిసి ఐరాజు, రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, సత్తి సోమరాజు, కాయల మణికంఠ, పాలెం బాబీ, గంధం శ్రీనివాస్, కనకరాజు, స్వామి పీఎస్‌పీకే, ఇతర నాయకులు పాల్గొన్నారు.



డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో నిందితులకు జరిమానా, జైలు శిక్ష

జగ్గంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందిపై జగ్గంపేట పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వారిని మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టారు. 11 మందికి రూ.10వేల చొప్పున జరిమానా, నలుగురికి రెండు రోజులు జైలు, ఏడుగురికి ఒకరోజు జైలు శిక్ష విధించినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు.



దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మురారి దుర్గమ్మ తిరునాళ్లు ప్రారంభం

గండేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారి గ్రామ శివారున మామిడి తోటలో వెలసిన కనకదుర్గమ్మ తల్లి తిరునాళ్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. చుట్టుపక్కల జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వచ్చిన భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు.

కొండబాబుకు సన్మానం

జగ్గంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్షనర్ల భవనంలో వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు ముమ్మిడివరపు సురేష్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు)ను మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో తోలేటి సూర్యనారాయణ, మల్లేశ్వరరావు మాస్టారు, వి.నాగసత్య, కొత్త నాగపండు, చంద్రమౌళి వెంకటశాస్త్రి, సమ్మిటి సాయిరాం, పులపర్తి శంకర్, మానేపల్లి సతీష్, పొట్టి రాజేష్, పి.జోగి రాజు, కర్రి సత్తిబాబు, అక్షర కాలేజ్ ప్రిన్సిపాల్ నీలం చక్రధర్, రిటైర్డ్ ఎంఈవో ఉదయభాస్కర్ చౌదరి, గద్దె మారుతి, కోడూరి శ్రీను, ఎస్.వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్మీపురం గ్రామానికి ఫారెస్టు రోడ్డు క్లియరెన్స్ ఇవ్వాలి'

దేవీపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి ఫారెస్ట్ అధికారులు రోడ్డు క్లియరెన్స్ ఇవ్వాలని, వెలగపల్లి వద్ద సీతపల్లి వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వి.రామన్నపాలెం పంచాయతీ పరిధి లక్ష్మీపురంలో సుమారు 85 ఆదివాసీ గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. ఈ గ్రామంలో చిన్న పిల్లలు, వృద్ధులు, అనారోగ్యానికి గురైన గర్భిణులు, మహిళలు ఆసుపత్రికి వెళ్లాలంటే డోలీ మోతలు తప్పడం లేదన్నారు. తక్షణం ఈ రోడ్ల నిర్మాణం చేపట్టాలని లేకుంటే ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆదివాసీ జేఏసీ నాయకులు కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు, కోసు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి'

వై.రామవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24, 2024-25 సంవత్సరాల్లో మంజూరైన పీఎం జనమన్, 2021-22లో మంజూరైన పీఎంఏవై గ్రామీణ్ పథకాలకు సంబంధించి మంజూరైన గృహాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని సంబంధిత అధికారులను గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన పనసలపాలెం, చామగడ్డ పంచాయతీల్లో లబ్ధిదారులతో సమావేశమయ్యారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున పాల్గొన్నారు.